www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 05 | జూలై | 2025
పేజీలు : 8

## మూగజీవాల పరిహారంలోనూ అక్రమాలు



2 లో

-మూగజీవాల పరిహారం నగదు వైద్యురాలి భర్త అకౌంట్‌కి మళ్లింపు

-పశు వైద్యురాలి భర్తపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

# శాపమైన పోలీసుల నిర్లక్ష్యం


(ఫైల్)

-పోలీసులనే బురిడి కొట్టించిన సైబర్ నేరగాడు

-ఇదేమి విచారణ అంటూ బాధితుల వేదన

-మంత్రి ముందు గోడువెళ్లబోసుకున్న బాధితులు

**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** తమకు వచ్చిన సమాచారాన్ని, ఫిర్యాదును పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిన పోలీస్ శాఖ ఎద్దు ఈనిందంటే గాటికి కట్టేయ్యమన్నట్లు వ్యవహరించింది. ఈ నిర్లక్ష్యం ఓ కుటుంబం పాలిట శాపంగా మారింది. బాధితుల ఆర్థిక పరిస్థితి, సామాజిక వర్గాన్ని బట్టి స్పందించే పోలీసులు ఈ విషయంలోనూ అదే పని చేశారు. చివరకు వ్యక్తి తప్పిపోయి ఇబ్బందులు పడుతున్న కుటుంబానికి మరి కొంత ఆర్థిక ఇబ్బందిని కలిగించారు. వివరాల్లోకి వెళితే... ఏదులాపురం మున్సిపాలిటీలోని పెద్దతండాకు చెందిన బానోత్ నరేష్ జూన్ 23న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అతని కోసం కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం ప్రయత్నించిన దొరకలేదు. ఈ క్రమంలో నరేష్ సతీమణి నిర్మల ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసును నమోదు చేశారు. నరేష్ ఆచూకీ కోసం పలు చోట్ల అతని ఫోటోతో కూడిన సమాచారాన్ని కుటుంబ సభ్యులు ఏర్పాటు చేయడంతో పాటు నరేష్ సోదరుని ఫోన్ నెంబర్‌ను

మిగతా 2లో..

# ఎందుకీ మౌనం




-వసూళ్ల దందా వెనక విద్యుత్ శాఖాధికారి

-లక్షల్లో వసూళ్లు - స్పందించని అధికారులు

-న్యాయం చేయాలంటున్న బాధితులు

**ప్రజాపక్షం/అశ్వాపురం :** ఓ ప్రైవేటు వ్యక్తి విద్యుత్ శాఖాధికారి పేరుతో భారీగా వసూళ్లకు పాల్పడినట్లు అన్ని ఆధారాలు దొరికిన విద్యుత్ శాఖాధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారో అర్థం కావడం లేదు. వసూళ్లకు పాల్పడిన ఆ వ్యక్తిపై చర్యలు తీసుకుంటే ఆ శాఖలోని ఓ ఉన్నతాధికారి గుట్టు రట్టవుతుందన్న ఆలోచనతోనే చర్యలకు జంకుతున్నట్లు సమాచారం. విద్యుత్ శాఖ పేరుతో వసూళ్లకు పాల్పడినప్పుడు బాధితులు విద్యుత్ శాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటే పోలీసులకు ఫిర్యాదు చేయాల్సిన అధికారులు మౌనం వహించడం వెనక పలు ఆలోచనలు ఉన్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే వేరే వ్యక్తి పేరుతో కాంట్రాక్ట్ ఉంటే మరో వ్యక్తి చేత విద్యుత్ శాఖలో పనులు చక్కబెడుతూ తమ వాటా తాము తీసుకుంటున్న అధికారులు ఇప్పుడు ఆ వ్యక్తి పై చర్యలు తీసుకుంటే తమ గుట్టు రట్టవుతుందని భావిస్తున్నారు. అశ్వాపురం మండలంలో ఓ ప్రైవేటు వ్యక్తి విద్యుత్ కనెక్షన్లు, విద్యుత్ లైన్ల ఏర్పాటు, కొత్త మీటర్లు ఇలా అన్నింటి పేరుతో పెద్ద మొత్తంలో వసూళ్లు చేశాడు. ఈ వసూళ్ల వార్త శుక్రవారం ప్రజాపక్షం దినపత్రికలో ప్రచురితం కావడంతో పలువురు వసూళ్లరాయుని బాధితులు ప్రజాపక్షం విలేకరికి ఫోన్ చేసి తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. అధికారుల మౌనం పైన తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. అశ్వాపురం లోని ఎస్సి కాలనీకి చెందిన మామిడాల శివయ్య విద్యుత్ కనెక్షన్ కోసం సదరు ప్రైవేటు వ్యక్తిని సంప్రదించగా వెంటనే రూ. 15వేలు ఇస్తే మీకు రేపే మీటర్ వస్తుందని నమ్మబలికాడని ఐదువేలు ఇచ్చానని ఇంత వరకు మీటర్ ఇవ్వలేదని వాపోయాడు. ఇప్పుడు ఫోన్ ఎత్తడం లేదని ఎన్ని రోజుల నుంచి అడుగుతున్నా అటు మీటర్ ఏర్పాటు కానీ, ఇటు డబ్బులు తిరిగి ఇవ్వడం కానీ జరగ లేదన్నారు. అదే కాలనీకి చెందిన విసంపల్లి సాయిరాం తన ఇంటి ముందు ఉన్న విద్యుత్ స్తంభాన్ని మార్చే విషయమై అధికారులను సంప్రదిస్తే ప్రైవేటు వ్యక్తిని సంప్రదించాలని సూచించారని రూ. 10వేలు

మిగతా 2లో..

# ఉపాధి హామీకి బిజెపి తూట్లు




**ప్రజాపక్షం/ కొణిజర్ల :** కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా వచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బిజెపి ప్రభుత్వం తూట్లు పోడుస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. కాంతయ్య ఆరోపించారు. బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి కోత విధించడంతో పాటు పని దినాల సంఖ్యను తగ్గించారని ఆయన తెలిపారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా 26వ మహాసభ శుక్రవారం కొణిజర్లలో అమరజీవులు సిద్ది వెంకటేశ్వర్లు, వెంపటి సూర్యనారాయణ నగర్‌లో జరిగింది. మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన కాంతయ్య మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల పట్ల వివక్ష ప్రదర్శిస్తుందని తద్వారా వ్యవసాయ కార్మికుల పరిస్థితి దుర్భరంగా మారిందన్నారు. దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగాన్ని కార్పోరేట్ల పరం చేసేందుకు బిజెపి ప్రయత్నిస్తుందని తద్వారా వ్యవసాయ రంగం నుండి గ్రామీణ ప్రజలు వైదొలగక తప్పని స్థితి ఏర్పడుతుందన్నారు. వ్యవసాయ కార్మికులు ప్రత్యామ్నాయ రంగాల వైపు జీవనోపాధి కోసం వెళ్తున్నారని కాంతయ్య తెలిపారు. ధరల పెరుగుదల పేద, మధ్యతరగతి ప్రజలకు

-పేదలను ఇబ్బందిపెడుతున్న ధరల పెరుగుదల

-సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గం

-వ్య.కా.సం రాష్ట్ర అధ్యక్షులు కాంతయ్య

మిగతా 2లో..

## విపత్తుల నిర్వహణకు
# పూర్తి స్థాయిలో సన్నద్ధం




-వరద ఉధృతిని అంచనా వేయాలి

-నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షించాలి

-జిల్లా విపత్తు నిర్వహణ అథారిటీ సమావేశంలో కలెక్టర్ అనుదీప్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** వరద విపత్తుల నిర్వహణకు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉన్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ, ఎండిఎంఏ జాయింట్ అడ్వయిజర్ నావల్ ప్రకాష్, అడ్మినిస్ట్రేటర్, సెక్రటరీ అభిషేక్ బిస్వాస్, డిఎం కన్సల్టెంట్ డా॥ వజీం ఇక్బాల్, తెలంగాణ రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ కన్సల్టెంట్ గౌతమ్ కృష్ణ తేజ, బి. అనుపమ, టిజె సంద్ర సంబంధిత అధికారులతో కలిసి జిల్లా విపత్తు నిర్వహణ అథారిటీ సమావేశం నిర్వహించారు. గతేడాది వచ్చిన భారీ వరదలు, విపత్తుల నిర్వహణ కోసం జిల్లాలో చేసిన ఏర్పాట్లు, ప్రణాళిక తదితర అంశాలను కలెక్టర్

మిగతా 2లో..

# శాపమైన పోలీసుల నిర్లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చారు. ఈ నేపథ్యంలో నరేష్ సోదరునికి పలు మార్లు వాట్సాప్ కాల్ రాగా అతను లిఫ్ట్ చేయలేదు. ఆ తర్వాత నేను ఒడిశా నుంచి ఫారెస్ట్ సిఐని ఎందుకు ఫోన్ ఎత్తడం లేదు తప్పిపోయిన మీ తమ్ముడు నా దగ్గరే ఉన్నాడంటూ సమాచారమిచ్చాడు. ఈ సమాచారాన్ని కూడా నరేష్ కుటుంబ సభ్యులు పోలీసులకు చూపించారు. రూరల్ సిఐ ఈ కేసును పరిశీలించేందుకు ఎస్ఐను కేటాయించగా ఆ ఎస్ఐ ఆ సమాచారం ఇచ్చిన వ్యక్తితో దాదాపు పది నిమిషాలు చాటింగ్ చేశాడు. మీ తమ్ముడు వారి వద్దే ఉన్నాడట మీరు వెంటనే ఒక వాహనం తీసుకుని ఒడిశా వెళితే తీసుకుని రావచ్చు. నేను ఒక కానిస్టేబుల్‌ను కేటాయిస్తానని ఆ ఎస్ఐ చెప్పడంతో అప్పు చేసి ఒక వాహనాన్ని సమకూర్చుకుని తప్పిపోయిన నరేష్ బావ, కానిస్టేబుల్ ఒడిశాకు వెళ్లారు. అతను వాట్సాప్‌లో ఇచ్చిన అడ్రస్‌కు చేరుకుని సంప్రదించే ప్రయత్నం చేయగా అతను ఫోన్ ఎత్తలేదు. అక్కడి పోలీసులను సంప్రదిస్తే అది ఫేక్ నెంబర్ అని ఇది సైబర్ నేరగాళ్ల పని అని అంత దూరం నుంచి ఎందుకు వచ్చారని వీరినే ప్రశ్నించడంతో చేసేది ఏమి లేక వెనుదిరిగారు. పోలీసుల నిర్లక్ష్యం ఆ కుటుంబానికి మరింత ఇబ్బంది కలిగించింది. వాస్తవానికి ఏ నెంబర్ నుంచి వాట్సాప్ చాటింగ్ జరిగిందో ఆ నెంబర్‌ను తీసుకుని వెంటనే నెంబర్ ఎవరిది అతను చెబుతున్నట్లు పోలీస్ అధికారిదా అయితే అతను ఎక్కడుంటాడు అనే వివరాలను పోలీస్ శాఖ ద్వారా తెలుసుకోవచ్చు. నెంబర్ ఎవరిదనేది తెలుసుకోవడం పోలీస్ శాఖకు పెద్ద పని కూడా కాదు. వాట్సాప్‌లో చాట్ చేసి తప్పిపోయిన వ్యక్తి అతని



మిస్సింగ్ వ్యక్తి భార్య



మిస్సింగ్ వ్యక్తి బావ

వద్దే ఉన్నాడంటూ ఓ కానిస్టేబుల్‌ను ఇచ్చి పంపడం విడ్డూరంగా ఉంది. ఇదే విషయాన్ని రెండు రోజుల క్రితం రూరల్‌లో ఏసిపి ఆఫీస్ ప్రారంభానికి వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముందు బాధితులు గోడు వెళ్లబోసుకున్నాడు. భర్త తప్పిపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్నానని తన భర్త ఆచూకీ కనుగొనాలని రోదిస్తూ మంత్రికి విన్నవించింది. స్పందించిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెంటనే నరేష్ ఆచూకీని కనిపెట్టాలని అవసరమైతే ప్రత్యేక బృందాన్ని కేటాయించాలని ఆదేశించారు. నరేష్‌కు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. తండ్రి కోసం వారు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. రూరల్ పోలీసులు నిర్లక్ష్యాన్ని పక్కనపెట్టి నరేష్ ఆచూకీ కోసం ప్రయత్నించాలని స్థానికులు కూడా కోరుతున్నారు. పోలీసులనే బురిడి కొట్టించిన ఆ సైబర్ నేరగాడు సామాన్యుల విషయంలో ఎలా వ్యవహరిస్తాడన్న ఆందోళన వ్యక్తమవుతుంది.

# ఎందుకీ మౌనం

(మొదటిపేజీ తరువాయి)

డిమాండ్ చేయగా ఎనిమిది వేలకు అంగీకరించాడని ఐదువేలు తీసుకుని ఐదు నెలలు అవుతున్న ఇంత వరకు స్పందించ లేదన్నారు. చవిటి గూడెం వీధికి చెందిన నర్సయ్య వద్ద వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం రూ.26,500 తీసుకుని ఏళ్లు గడుస్తున్నా కనెక్షన్ ఇవ్వలేదని విద్యుత్ శాఖాధికారులు మాత్రం మీరు డిడిలు తీస్తే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి కనెక్షన్ ఇస్తామంటున్నారని వాపోయాడు. అశ్వాపురం మండల వ్యాప్తంగా విద్యుత్ శాఖలో వివిధ పనుల నిమిత్తం ప్రజల వద్ద నుంచి లక్షలాది రూపాయలు వసూళ్లు చేసినట్లు సమాచారం. శుక్రవారం ప్రజాపక్షంలో వార్త ప్రచురితం కాగా తనకు ఇటువంటి వార్తలతో ఇబ్బంది లేదని నా వెనక విద్యుత్ శాఖాధికారులు ఉన్నారని పలువురి వద్ద ధీమా వ్యక్తం చేసినట్లు సమాచారం. విద్యుత్ శాఖాధికారుల సహకారం లేకుండా, పాత్ర లేకుండా తాను వసూళ్లు చేయలేదని సదరు వసూళ్ల రాయుడు వ్యాఖ్యానించడం విశేషం. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయడంతో పాటు వసూళ్ల రాయుడిపై తగు చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

# ఉపాధి హామీకి బిజెపి తూట్లు





(మొదటిపేజీ తరువాయి)

తీవ్ర ఇబ్బందిగా మారిందని, ధరల పెరుగుదల పాలకుల వైఫల్యమేనని కాంతయ్య తెలిపారు. మోడీ విధానాల కారణంగా ఆర్థిక అంతరాలు పెరిగి సంపద కొందరి చేతుల్లో కేంద్రీకృతమవుతుందని దీనితో పేదలు మరింత పేదలుగా మారుతున్నారన్నారు. విద్య, వైద్యం, సంక్షేమం ఆశించిన స్థాయిలో పేదల దరి చేరడం లేదని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో తీవ్ర జాప్యం జరుగుతుందని, ఇందిరమ్మ భరోసా పథకాన్ని వ్యవసాయ కార్మికులకు బేషరతుగా అమలు చేయాలని తక్షణం పేదల ఖాతాల్లో రూ. 12వేల చొప్పున జమ చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికులకు అన్ని సంక్షేమ పథకాలు వర్తింపజేయడంతో పాటు జాతీయ ఉపాధి హామీ పథకం పని దినాలు పెంచి రోజుకు రూ. 600 గిట్టుబాటు అయ్యేవిధంగా సవరించాలని కాంతయ్య డిమాండ్ చేశారు. దేశంలో అమలవుతున్న సంక్షేమ పథకాల వెనక కమ్యూనిస్టుల పోరాటాలు, త్యాగాలు ఉన్నాయని, పోరాటాలు లేకుండా సమస్యలు పరిష్కారం కావన్నారు. పోరాటాలకు సంసిద్ధులు కావాలని కాంతయ్య పిలుపునిచ్చారు. మహాసభ ప్రారంభ సూచికగా వ్యవసాయ కార్మిక సంఘం పతాకాన్ని కాంతయ్య ఆవిష్కరించారు. సిద్దినేని కర్ణకుమార్, పగిడిపల్లి ఏసు, వీరబాబు, కంపసాటి వెంకన్న, ఈశ్వరమ్మ అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన ఈ సభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు, మందడపు రాణి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు దండు ఆదినారాయణ, తాటి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

# మూగజీవాల పరిహారంలోనూ అక్రమాలు

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** ప్రభుత్వ అధికారులకు ప్రతినెల లక్షల్లో ప్రభుత్వాలు ప్రజాధనాన్ని వేతనాలుగా చెల్లిస్తుంటే కొందరి అధికారుల కక్కుర్తి చూస్తుంటే ముక్కున వేలేసుకునే పరిస్థితి తీసుకువస్తున్నారు. చివరికి వరదల్లో కొట్టుకుపోయిన మూగజీవాల పరిహారంలో కూడా పశు వైద్యురాలు చేసిన అక్రమాలు అంతా ఇంతా కాదు. వివరాల్లోకి వెళ్తే... తిరుమలాయపాలెం మండలంలో గత సంవత్సరం సెప్టెంబర్ వారంలో వచ్చిన భారీ వరదలకు అజ్మీర్‌తండా గ్రామ పంచాయతీ శివారు రాకాసి తండా ఆకేరు వెంబడి ఉండగా ఆకేరు భారీ వరదతో రాకాసితండా గ్రామంతా చుట్టుముట్టగా ప్రాణభయంతో ప్రజలంతా డాబాలపై ఎక్కి తమ ప్రాణాలు రక్షించాలని సెల్ఫోన్ల ద్వారా సమాచారాన్ని పాలేరు శాసనసభ్యులు, రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి సమాచారం అందించగా ఆయన వెంటనే స్పందించి అధికారులందరిని అలెర్ట్ చేసి ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను రప్పించి వరదలో చిక్కుకున్న ప్రజల ప్రాణాలను రక్షించారు. ఈ క్రమంలో రాకాసితండా ఇండల్లో ఉన్న ధాన్యంతో పాటు విలువైన వస్తువులు, పశు సంపద అయిన ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్లు అన్ని వరద ప్రవాహంలో కొట్టుకుపోగా భారీ వరదల తీవ్రత నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బృందంతో పాటు రాష్ట్ర బృందం పర్యటించింది. నష్టపోయిన వారికి ప్రభుత్వం భారీ నగదును ప్రకటించింది. కాని మూగజీవాల పరిహారంలో పశువు వైద్యురాలి భర్త సాయి చేసిన అక్రమాలు అంతాఇంతా కావు. వరదలు ఒక చోట అయితే మరోక చోట పరిహారం ఇప్పించి లక్షల రూపాయలు కొల్లగొట్టినట్లు గ్రామస్తులు చెప్పుతున్నారు. వరదల్లో కొట్టుకుపోయిన మూగజీవాల పరిహారం బాధితుడికి రావాల్సిన రూ.76వేలు నగదు నేరుగా వైద్యురాలి భర్త అకౌంట్‌కి మళ్లించి తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు. సుమారు 9నెలలు అవుతున్నా పరిహారం డబ్బులు ఇవ్వకుండా తిప్పుతుండగా గొడవ చేయడంతో రూ.58వేలు ఇచ్చి ఇంకా రూ.18వేలు ఇవ్వాల్సి ఉండగా సమాధానం చెప్పకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు జరుపుల వెంకన్న ఫిర్యాదు చేశాడు. ఎలాంటి సంబంధం లేని పశువు వైద్యురాలి భర్త అకౌంట్లోకి మూగజీవాల పరిహారం ఎలా మళ్లించారని బాధితులు ఆందోళన చేస్తున్నారు. పూర్తి విచారణ చేపడితే మూగజీవాల పరిహారంలో భారీ అక్రమాలు వెలుగులోకి వస్తాయని బాధితులు ఆరోపిస్తున్నారు. అక్రమాలపై గతంలో పలు పత్రికల్లో వార్తలు ప్రచురించినా జిల్లా పశువర్ధకశాఖ అధికారుల మౌనంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# వీర తెలంగాణ సాయుధ పోరాటానికి ఊపిరి కొమరయ్య

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** వీర తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరత్వం పొందిన దొడ్డి కొమరయ్య సాయుధ పోరాటానికి ఊపిరిలిచ్చాడని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య అన్నారు. శుక్రవారం స్థానిక మంచి కంటి భవన్లో వీర తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య వర్ధంతి కార్యక్రమం జరిగింది. ముందుగా కొమురయ్య చిత్రపటానికి కనకయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమం లో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు అధ్యక్షత వహించగా అన్నవరపు సత్యనారాయణ, సభ్యులు భూక్యా రమేష్, సంద లక్ష్మి, వెంకటేశ్వర్లు, రామ్ చరణ్, బాలకృష్ణ, రాములు, రఘు నాగమణి, మల్లేష్ పాల్గొన్నారు.



# విపత్తుల నిర్వహణకు పూర్తిస్థాయిలో సన్నద్ధం

(మొదటిపేజీ తరువాయి)

పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. విపత్తుల సమయంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనుల గురించి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతేడాది 24 గంటల వ్యవధిలో ఖమ్మం నగర చరిత్రలో ఎన్నడు లేనివిధంగా వరదలు వచ్చాయని, మున్నేరు పరివాహక ప్రాంతాలు ముంపుకు గురయ్యాయని, తిరుమలాయపాలెం మండలంలో రాకాసితండా, అజ్మీరతండాలో 150 మందిని ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు రక్షించాల్సి వచ్చిందన్నారు. గతేడాది వరదల్లో ఆరుగురు చనిపోయారని కలెక్టర్ తెలిపారు. ఆస్తి నష్టం జరిగిందని ప్రభుత్వం ఇంటికి రూ. 10వేల చొప్పున సాయం అందించిందని పెద్ద ఎత్తున పశు సంపద కూడా నష్టం జరిగిందన్నారు. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతు పనులు చేపట్టామన్నారు. ప్రస్తుత సంవత్సరం వరద విపత్తు నిర్వహణకు మరింత పకడ్బందీగా సన్నద్ధమయ్యామని తెలిపారు. నీటి వనరుల, వర్షాభావ పరిస్థితులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తున్నామని, వరద ఉధృతి అంచనాలను సమర్థవంతంగా తెలుసుకుంటూ, విపత్కర పరిస్థితుల్లో ముంపు, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వేగవంతంగా తరలించేందుకు రెవెన్యూ, పోలీస్, ఇతర శాఖల అధికారులు, ఆపద మిత్ర వాలంటీర్లను సన్నద్ధం చేశామన్నారు. విపత్తు సమయంలో రెస్క్యూ ఆపరేషన్ ఆస్కారం లేకుండా ముందుగానే ప్రజలను తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. వరదల ఉధృతి ఆధారంగా ప్రమాద హెచ్చరికలు జారీ చేస్తూ ఏ స్థాయిలో నీరు వస్తే ఏ ప్రాంత ప్రజలను తరలించాలో ఎస్‌వోపిని తయారు చేసుకున్నామన్నారు. ఖమ్మం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో వరద ప్రభావిత ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రజలకు విపత్తు నిర్వహణ పట్ల అవగాహన కల్పించామన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూము ఏర్పాటు చేసి టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశామన్నారు. 300 మందికి పైగా ఆపద మిత్రలకు స్థానిక కార్పోరేటర్లు, ప్రజా ప్రతినిధులకు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ పై అవగాహన కల్పించామన్నారు. జిల్లాలో నీటి వనరులలో 75 శాతం మాత్రమే నిండి ఉండేలా చూస్తున్నామని ఎక్కడ చెరువు కట్టలు కొట్టుకుపోకుండా చూస్తున్నామన్నారు. జిల్లాలో వాతావరణ పరిస్థితులను అంచనా వేయడంతో పాటు వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో వరద పరిస్థితులు, నీటి వనరుల నీటి నిల్వలు, మున్నేరు నది ప్రవాహం నిరంతరం మానిటరింగ్ చేయడం చాలా ముఖ్య మన్నారు. వరదల సమయంలో ప్రజలు సెల్ఫీ కోసం బయటకు రాకుండా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆకేరు, మున్నేరు నదుల్లో వాటర్ గేజ్‌లను ఏర్పాటు చేసి నిరంతరం మానిటరింగ్ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఎ. పద్మశ్రీ, జెడ్పిసిఈవో దీక్షారైనా, డిఆర్‌డివో సన్యాసయ్య, సిపివో ఎ. శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడివోలు, ఆపద మిత్రలు తదితరులు పాల్గొన్నారు.

# సాయిస్ఫూర్తిలో ఆన్ క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో ఆన్ క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్ ఆంద్రీ ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ వారిచే శుక్రవారం నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు బి టెక్ చివరి సంవత్సరం చదువుతున్న అన్నీ ఇంజనీరింగ్ బ్రాంచీల విద్యార్థినీ, విద్యార్థులు సుమారు 152 మంది హాజరయ్యారని కళాశాల ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా. డియన్ వి కృష్ణారెడ్డి తెలిపారు. ఈ రిక్రూట్మెంట్ డ్రైవ్ ను కంపెనీ ప్రతినిధి సతీష్ జయరామన్ వైస్ ప్రెసిడెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్ జయరామన్ మాట్లాడుతూ ఈ క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్ ను రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, మౌఖిక ఇంటర్వ్యూల ద్వారా ఆంద్రీ ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి 16 మందిని సాఫ్ట్వేర్ డెవలపర్ ఉద్యోగాలకు ఎంపికచేయటం జరిగిందన్నారు. వూటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ ప్రస్తుతం పలు ప్రముఖ కార్పొరేట్ కంపెనీలు, సంస్థలు ప్రతిభావంతులైన విద్యార్థినీ, విద్యార్థులను ఒడిసి పట్టుకునేందుకు అనుసరిస్తున్న విధానమే క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్ లన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త,విద్యాధికులు, హెటిరో ఫార్మాస్యూటికల్ కంపెనీ అధినేత, రాజ్యసభ సభ్యులు, సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డా. బండి.పార్థసారథిరెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విద, కళాశాల సెక్రటరీ అండ్ కస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డిలు విద్యార్థినీ, విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కళాశాల వైస్ ప్రిన్సిపాల్, సియస్ఈ విభాగాధిపతి డా షేక్.యాకూబ్ , అన్నీ ఇంజనీరింగ్ బ్రాంచీల విభాగాధిపతులు, క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్ ల కోఆర్డినేటర్స్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు




**ప్రజాపక్షం/ అశ్వావుపేట :** జూలై 9న అఖిలపక్షాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు ఉంటుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషా తెలిపారు. శుక్రవారం అశ్వారావుపేట సిపిఐ కార్యాలయంలో సయ్యద్ సలీం అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమవేశంలో ఆయన ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడుతూ నరేంద్రమోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, లేబర్ కోడ్‌లు రద్దు కోసం కార్మిక వర్గ హక్కుల పరిరక్షణ కోసం జాతీయ కార్మిక సంఘాలు చేస్తున్న సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం సంపూర్ణ స్థాయిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్మిక సంఘాలు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు, హక్కుల వలన 29 చట్టాలతో ఎన్నో ప్రయోజనాలు పొంది దేశంలో ప్రభుత్వ రంగం సంస్థలు బలోపేతం కావటంలో కార్మిక వర్గం పాత్ర మరువలేనిదన్నారు. ఈరోజు జిడిపి పెరుగుదలలో కార్మికవర్గ పాత్ర చరిత్రలో గొప్పదని, పెట్టుబడిదారి వర్గ ప్రయోజనం కోసం సాధించుకున్న కార్మిక చట్టాలను ప్రధాని మోడీ మార్చి కార్మికవర్గం గొంతునొక్కుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మిక సంఘాలు, కార్మికులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య మట్లాడుతూ పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం పార్టీ కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని అన్నారు. అనంతరం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహాసభలను అశ్వారావుపేటలో నిర్వహించాలని కార్యవర్గ సభ్యులు తీర్మానం చేయటం జరిగింది.ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కె.సారయ్య, కల్లూరి వెంకటేశ్వర్లు, మున్నా లక్ష్మీ కుమారి, నరాటి ప్రసాద్, పుల్లారెడ్డి, కమటం వెంకటేశ్వర్లు, చంద్రగిరి శ్రీనివాస్, సాలిగంటి శ్రీను, రేసు ఎల్లయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఇన్ఫోసిస్‌కు ఎస్‌బిఐటి విద్యార్థులు ఎంపిక



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ ఇన్ఫోసిస్ సంస్థకు ఎస్‌బిఐటి కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థినిలు ఎంపికైనట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్యాంపస్ ఫుల్ డ్రైవ్‌లో తమ విద్యార్థినిలు అద్భుత కనబర్చి ఎంపికయ్యారని తెలిపారు. జిల్లాలో అత్యధికంగా ఐదుగురు ఎంపిక కావడం తమకు గర్వకారణమన్నారు. శుక్రవారం ఎంపిక పత్రాలను అందుకున్న సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో గుండాల కృష్ణ మాట్లాడుతూ అటానమస్ హోదాను సాధించిన అనంతరం తమ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించడం ద్వారా ఈ ఫలితాలను సాధించగలిగామన్నారు. సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి. ధాత్రి మాట్లాడుతూ వివిధ దశల్లో నిర్వహించిన ఎంపిక పరీక్షల్లో ఐదుగురు అర్హత సాధించారని ఆమె తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఆరు నెలల పాటు శిక్షణలో రూ. 3.60 లక్షలు అందుకుంటారని అనంతరం రూ. 9లక్షలకు పైగా వార్షిక వేతనం పొందుతారని తెలిపారు. ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ 50కు పైగా అభివృద్ధి చెందిన దేశాల్లో విస్తరించిన సాఫ్ట్‌వేర్ సంస్థ ఇన్ఫోసిస్‌లో తమ కళాశాల విద్యార్థినిలు సిస్టం ఇంజనీర్‌గా ఎంపిక కావడం తమ కళాశాలకు గర్వకారణమన్నారు. టాస్క్ సహకారంతో నిర్వహించిన ఎంపికల్లో జిల్లాలో అగ్రగామిగా నిలవడంపై టాస్క్ యజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎంపికైన విద్యార్థినిలను అభినందించారు.ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఏవివి శివప్రసాద్, జే. రవీంద్రబాబు, ఎన్. శ్రీనివాసరావు, టిపివో ఎన్. సవిత, కో ఆర్డినేటర్ జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కౌలు రైతులకు రైతు భరోసా అందించాలి



**ప్రజాపక్షం/ బోనకల్ :** భూమి లేకపోయినా భూమిని కౌలుకు తీసుకుని పంటలు పండించే కౌలు రైతులు కూడా రైతన్నలేనని, వారికి కూడా ప్రభుత్వం రైతు భరోసా అందించాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జక్కుల రామారావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని గోవిందాపురం గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల హామీల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులకు రైతు భరోసా అందిస్తామని హామీ ఇచ్చిందని కాని ఆ హామీ అమలులోకి రాకపోవడంతో కౌలు రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని, కౌలు రైతులకు వెంటనే రైతు భరోసా అందించి న్యాయం చేయాలని కోరారు. అదేవిధంగా కౌలు రైతులకు విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ యంత్రాలు సబ్సిడీపై అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సిపిఐ నాయకులు ఆకెన పవన్, కౌలు రైతులు చింతల చెర్వు మదారయ్య, పుచ్చకాయల తిరపయ్య తదితరులు పాల్గొన్నారు.

# రోశయ్య జయంతి సందర్భంగా కుట్టుమిషన్లు పంపిణీ





**ప్రజాపక్షం/వైరా:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రివర్యులు కొణిజేటి రోశయ్య 92వ జయంతి సందర్భంగా స్థానిక వాసవి కళ్యాణ మండపంలో ఆర్యవైశ్య మండల సంఘం అధ్యక్షుడు మిట్టపల్లి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో రోశయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు వైరా వర్తక సంఘం అధ్యక్షులు వనమా విశ్వేశ్వరరావు, డాక్టర్ పెరుమాళ్ళ కృష్ణమూర్తి మాట్లాడుతూ రోశయ్య బడ్జెట్ ప్రవేశపెట్టినట్లుగా ఏ ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టలేదని, అసెంబ్లీ సమావేశాల్లో బడ్జెట్‌కు సంబంధించి ఒక్క రూపాయి లెక్క తప్పకుండా ఏ రంగానికి ఎంత చొప్పున బడ్జెట్‌ను కేటాయించామనే విషయాలపై సంక్షిప్తంగా చెప్పగలిగిన ఏకైక గొప్ప ఆర్థికవేత్త రోశయ్య అని కొనియాడారు. అనంతరం కొత్తూరి వెంకటరమణ కుమారుడు కొత్తూరు మనోజ్ జ్ఞాపకార్థం నిరుపేద కుటుంబానికి చెందిన మహిళలకు ముగ్గురికి కుట్టుమిషను ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పెరుమాళ్ళ కృష్ణమూర్తి, ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రథమ ఉపాధ్యక్షులు నూకల శ్రీనివాసరావు, మిట్టపల్లి సత్యంబాబు, మిట్టపల్లి వెంకటరమణ, మిట్టపల్లి నాగేశ్వరరావు, నూకల ప్రసాదరావు, కొమిరిశెట్టి శ్రీధర్, నాళ్ళ గంగాధర్, వెంకటసుబ్బారావు, కొత్తూరు వెంకటరమణ, దొడ్డా సుధాకర్, గజ్జల కృష్ణమూర్తి, నంబూరి వెంకటేశ్వర్లు, వజినేపల్లి చక్రధరరావు, పెనుగొండ రామారావు, రంగా సింహాద్రి, అనుమోలు భాస్కర్‌రావు, దారా వెంకటకృష్ణ, కొల్లా వెంకటరాంబాబు, యండ్రపూడి శివశంకర్, వజినేపల్లి రవి, మిట్టపల్లి నాగేంద్రబాబు, సముద్రాల మురళీకృష్ణ, మిట్టపల్లి విజయ్‌కుమార్, తెల్లాకుల సందీప్, వేముల కిషోర్, కటకం శివకృష్ణ, గజ్జల భాస్కర్, మిట్టపల్లి భాస్కర్, బండారు భాస్కరరావు, డోకుపర్తి మోహన్‌కృష్ణ, అనుమోలు రాజేష్, గ్రంధి లక్ష్మీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఈవిఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లా కలెక్టరేట్ ఆవరణలోని ఈవిఎం గోడౌన్‌ను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శుక్రవారం తనిఖీ చేశారు. నెలవారి తనిఖీల్లో భాగంగా ఈవిఎం గోడౌన్‌ను తనిఖీ చేసి, గోడౌన్ రూము సీల్‌ను పరిశీలించి, తనిఖీ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భద్రతా సిబ్బంది షిఫ్టుల వారీగా చేస్తున్న డ్యూటీల్లో ఖచ్చితంగా సమయపాలన పాటించాలని, భద్రతా సిబ్బంది ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు, ఎన్నికల డిటి అన్సారీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఉచిత న్యాయ సాయం పొందండి




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అందించే ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కెవి చంద్రశేఖర్‌రావు తెలిపారు. శుక్రవారం ఖమ్మం లోని మానేరు లా కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కెవి చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ గురించి వివరించారు. ఆర్థికంగా, వెనకబడిన వారి న్యాయ సాయం కొరకు ధనం వెచ్చించలేని వారు న్యాయ సేవాధికార సంస్థ వారు అందించే ఉచిత న్యాయ సహాయాన్ని పొందాలని తెలిపారు. పారా లీగల్ వాలంటీర్ యొక్క బాధ్యతలను వివరించారు. ఆసక్తి ఉన్న న్యాయ విద్యార్థులను పారా లీగల్ వాలంటీర్లుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. సీనియర్ న్యాయవాధి సంధ్యారాణి మాట్లాడుతూ జాతీయ సేవాధికార సంస్థ ప్రవేశపెట్టిన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిలింగ్ గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నంద చిరంజీవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో టిడిపి మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ మృతి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండల టిడిపి అధ్యక్షుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సానబోయిన శ్రీనివాస్ గౌడ్(50) రోడ్డు ప్రమాదంలో శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం...గురువారం రాత్రి ఓ వ్యక్తితో కలిసి ద్విచక్రవాహనంపై ఖమ్మం నగరానికి వెళ్లి వస్తూ ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని సత్యనారాయణ పురం సర్కిల్లోని బైపాస్‌రోడ్డు పక్కన టు వీలర్ పార్కింగ్ చేశాడు. తన వెంట వచ్చిన వ్యక్తి మూత్ర విసర్జనకు వెళ్లగా అక్కడ నిలబడ్డాడు. ఈ నేపథ్యంలో వెనకనుంచి వచ్చిన ఓ డీసీఎం వాహనం బలంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు చికిత్స నిమిత్తం తరలిస్తుండగా..మార్గం మధ్యలో మృతి చెందాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతి వార్త తెలుసుకున్న పార్టీల నాయకులు నివాళులర్పించారు. అందరినీ అన్నా,తమ్ముడు, అక్క, చెల్లి అంటూ ఆప్యాయంగా పిలిచే మంచి వ్యక్తి మృతి చెందడంతో స్వగ్రామమైన నాయడుపేట మూగబోయింది. కాగా ఈ ఘటనపై పోలీసుల నిర్లక్ష్యమే కారనమంటూ ప్రజలు ఆరోపించారు. పెద్ద పెద్ద వాహనాలు తిరిగే ప్రధానరోడ్డుపై పర్యవేక్షనలేకపోవడమే కారనం అంటూ వాపోయారు. ఖమ్మంనగరంలోకి వెళ్లే చాప్టారోడ్డును నిలుపుదల చేయడంతో ఈ రోడ్డుగుండా వచ్చి మృత్యువాత పడ్డాడని ఆవేదన సైతం వ్యక్తం చేశారు.

# నేడు మధిరకు జస్టిస్ చంద్రకుమార్ రాక



**ప్రజాపక్షం/ మధిర :** ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న న్యాయవాద అవగాహన తరగతులకు రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి బి. చంద్రకుమార్ శనివారం మధిరకు రానున్నారు. శుక్రవారం మధిరలో జరిగిన న్యాయవాదుల సమావేశంలో సీనియర్ న్యాయవాది వాసిరెడ్డి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుత న్యాయ వ్యవస్థలో వచ్చిన మార్పులకు సంబంధించి న్యాయవాదులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ తరగతులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జులై ఒకటి 2024 నుంచి అమలవుతున్న భారతీయ నాగరిక సురక్ష సంహిత 2023 భారతీయ న్యాయ సంహిత, భారతీయ సాక్ష్య అధికార నియం చట్టాలపై అవగాహన కల్పించనున్నట్లు వాసిరెడ్డి తెలిపారు. న్యాయవాదిగా ఎంతో అనుభవం కలిగి అనంతరం న్యాయమూర్తిగా పనిచేసిన చంద్రకుమార్ ఆర్ట్ ఆఫ్ క్రాస్ ఎగ్జామినేషన్ ఇన్ క్రిమినల్ కేసెస్ అనే విషయంతో పాటు వృత్తి పరమైన విలువలు కొత్త నేర చట్టాలు అనే అంశాలపై బోధించనున్నట్లు ఆయన తెలిపారు. చంద్రకుమార్ పదవి విరమణ తర్వాత కూడా సమాజ మార్పు కోసం అనునిత్యం కృషి చేస్తున్నారని తెలిపిన వాసిరెడ్డి మధిరలో తొలిసారిగా జరుగుతున్న ఈ అవగాహన తరగతులను మధిర ప్రాంత న్యాయవాదులు వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఐఏఎల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌కె లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు, మధిర బార్ అసోసియేషన్ అధ్యక్షులు పుల్లారావు, ప్రధాన కార్యదర్శి జే. రమేష్, ఐఏఎల్ ఉపాధ్యక్షులు కె. రమేష్, తేలప్రోలు వెంకట్రావు, ప్రచార కార్యదర్శి జివి లక్ష్మి నారాయణ, ఐఏఎల్ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, న్యాయవాదులు జగన్‌మోహన్‌రావు, జ్ఞానేష్, సిహెచ్ రామరాజు, జి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## సికిల్ సెల్ అనీమియా పరీక్షలు



**ప్రజాపక్షం/మణుగూరు:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మణుగూరు పరిధిలో గల అన్ని జిపిఎస్ స్కూల్ ల యందు శుక్రవారం సికిల్ సెల్ అనీమియా పరీక్షలు చేశారు. సికిల్ సెల్ అనీమియా అనేది ఒక వారసత్వంగా వచ్చే రక్త రుగ్మత, ఇది ఎర్ర రక్త కణాల ఆకృతుని మార్చడం, ఆక్సిజన్ ను తీసుకువెళ్లే సామర్థ్యన్ని తగ్గిస్తుంది, దీనివల్ల రక్త హీనత ఇతర సమస్యలు వస్తాయి. బుగ్గ, ఖమ్మం తోగు స్కూల్ నందు 14 మంది పిల్లలకు పరీక్షలు చేయడం జరిగింది. అనంతరం ఆ గ్రామాల్లో గృహ సందర్శన చేసి పరిసరాల పరిశుభ్రత, వ్యక్తి గత పరిశుభ్రత పై, మలేరియా, డెంగీ జ్వరాలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ లు రాంప్రసాద్, కృష్ణ, కౌసల్య, ఎంఎల్‌హెచ్‌పి ప్రియా భారతి , ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## బడిబాట పడితే భవిష్యత్తు బాగుంటుంది



**ప్రజాపక్షం/మణుగూరు:** బడిబాట పడితే భవిష్యత్తు బాగుంటుందని యాచకురాలికి నచ్చ చెప్పి తన కూతురిని ఉపాధ్యాయుడు మాలోత్ భద్రు బడి బాట పట్టించాడు. శుక్రవారం ఉదయం పట్టణంలోని పూల మార్కెట్ సెంటర్ లో యాచకురాలు తన కూతురిని వెంట బెట్టుకొని భిక్షాటన చేస్తుండగా గమనించిన శివలింగాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గా పని విధులు నిర్వహిస్తున్న మాలోత్ భద్రు ఆ తల్లితో మాట్లాడి తన కూతురిని ప్రతిరోజు పాఠశాలకు పంపిస్తే అమ్మాయి భవిష్యత్తు బాగుంటుందని చెప్పి తనే స్వయంగా ఆ విద్యార్థిని తన ద్విచక్ర వాహనంపై పాఠశాలకు తీసుకువెళ్లాడు. ఆ విద్యార్థికి కావలసిన వస్తువులు బుక్స్ స్టాల్ కి వెళ్లి స్కూల్ బ్యాగ్, పలక, గొడుగు, పెన్నులు, పెన్సిల్ ఇప్పించి ప్రతి రోజు స్కూల్ కి వచ్చి విద్యా బుద్ధులు నేర్చుకుంటే ఉన్నత స్థాయికి చేరుకుంటావని తెలియజేశారు. ప్రభుత్వ స్కూల్లో నాణ్యమైన విద్య, ఉచితంగా పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫామ్, మధ్యాహ్నం భోజనం ప్రవేట్ పాఠశాలలకు దీటుగా విద్య అందిస్తుందని తెలిపారు. విద్యాబుద్ధులు నేర్చుకునే వయస్సులో స్కూల్ వెళ్లకుండా వివిధ రకాల దుకాణాల్లో పనికి వెళితే వారి వివరాలు తెలియజేయాలన్నారు. వారి తల్లిదండ్రుల తో మాట్లాడి బడి బాట పట్టే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రధానోపాధ్యాయులు, తోటి ఉపాధ్యాయులు, స్థానికులు, సహచర మిత్రులు, నేతాజీ వాకర్స్ ఆయనను అభినందించారు.

## ఘనంగా రోశయ్య జయంతి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని బేతుపల్లి గంగారంలో గల 15వ పోలీస్ బెటాలియన్ నందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెటాలియన్ కమాండెంట్ ఎన్.పెదబాబు పాల్గొని కొణిజేటి రోశయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పెదబాబు మాట్లాడుతూ కొణిజేటి రోశయ్య మంచి విద్యావేత్తని, భాహు భాష ప్రావిణ్యుడని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా మంచి సేవలను అందించారన్నారు. అనేక రకాల మంత్రి శాఖలను సమర్థవంతంగా నిర్వహించారని పేర్కొన్నారు. 2007లో ఆంధ్ర విశ్వవిద్యాలయం రోశయ్యకు గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేసిందన్నారు. అటువంటి మహనీయుల ఆశయ సాధనకై మనమందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి అదనపు దళాధిపతి ఏ. అంజయ్య, సహాయ దళాధిపతి రంగారెడ్డి, ఆర్ఐ లు,ఆర్ఎస్ఐ లు, పటాలపు ఇతర అధికారులు, సిబ్బంది, మినిస్టీరియల్ స్టాఫ్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా వంగవీటి జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణంలోని వంగవీటి రంగా ప్రాగణంలో అభిమానులు, మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో వంగవీటి మోహన రంగా 78వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మున్నూరు కాపు సంఘం ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి అభిమానులు అందజేశారు. అనంతరం రంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పి.ఎల్ ప్రసాద్, మాధురి మధు మానుకోట, సుంకర వాసు, పెద్దిరెడ్డి పురుషోత్తం, రామిశెట్టి కృష్ణ, తోకల సురేష్, మోహన్ రావు, సింగవరపు నరేష్, కపిల్వాయి నాగు, మురహరి వెంకటేష్, మొక్క రాజేష్, రంగిశెట్టి చంటి, మణికంఠ, దాసరి సత్యనారాయణ, జెమిని సతీష్, దాసరి రమణ, దాసరి అయోధ్య, ఆళ్ల నరేష్, ఉప్పు రామకృష్ణ, హోటల్ దుర్గా పాల్గొన్నారు.

# పబ్లిక్ టాయిలెట్స్ కష్టాలు తీరేదెన్నడో..?

**-ఏండ్లుగా మరుగుదొడ్ల కొరకు ఎదురుచూపు**
**-బయ్యారం క్రాస్ రోడ్డులో ప్రజా మరుగుదొడ్లు నిర్మించాలి**
**-పట్టించుకోని సంబంధిత అధికారులు**




**ప్రజాపక్షం/పినపాక:** బహిరంగ మల, మూత్ర విసర్జన చేయకండి.. మరుగుదొడ్డలను వాడండి.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి.. అని ప్రతి సమావేశాల్లో నీతి మాటలు చెప్పే అధికారులు ఆచరణలో అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఆయా కార్యాలయాలకు, వచ్చే ప్రజలు కనీసం మూత్ర విసర్జనకు చేయాలంటే ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. మండల కేంద్రంలో ప్రజా మరుగుదొడ్లు మూత్రశాలలు లేక పినపాక మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వివిధ గ్రామాల నుంచి వచ్చే వారి సంఖ్య రోజురోజుకు గణనీయంగా పెరుగుతోంది. ఏడూళ్ల బయ్యారం క్రాస్ రోడ్డు పరిధిలో పెరుగుతున్న వ్యాపారం, జనాభాకు అనుగుణంగా అధికారులు సరైనా సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. కనీసం మరుగుదొడ్లు, మూత్రశాల లేకపోవడంతో ప్రజలు ఎన్నో అవస్థలు పడుతున్నారు. గ్రామ స్వచ్ఛతకు అందరూ సహకారం అందించాలి, బహిరంగ ప్రదేశాల్లో మూత్ర విసర్జన చేయవద్దని తెలిసినా కూడా ఎక్కడబడితే అక్కడ మూత్ర విసర్జన చేస్తున్నారు. ఎక్కడ కూడా ప్రజలకు కావలసిన సౌకర్యాలను మాత్రం కల్పించడం లేదు. ఇతర గ్రామస్తులు దుకాణాల్లోకి సిబ్బందికి ఎవరికైనా ఒకటికి, రెంటికి వస్తే వ్యాపారులు దుకాణాలకు వదిలి ఇంటికి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని అంటున్నారు. పలువురు ఖాళీ స్థలాల్లో మూత్ర విసర్జన చేపట్టడంతో పరిసరాలు దుర్గంధంగా మారుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మండల కేంద్రంలో కనీసం పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించి, ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

**ప్రజా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి : బిజెపి మండల అధ్యక్షులు డి. శివ ప్రసాద్**



ఏడూల్ల బయ్యారం క్రాస్ రోడ్ లో పబ్లిక్ మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, గతంలో కూడా ఈ మరుగుదొడ్ల విషయాన్ని సంబంధిత అధికారులకు తెలియజేశామని ఆయన అన్నారు. ప్రతిరోజు ఆయా గ్రామాల నుండి వివిధ పనుల కొరకు వచ్చే ప్రజలు మరుగుదొడ్లు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు ప్రజా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి.

**ప్రతిపాదనలు పంపించాం.. మంజూరు అయ్యింది : ఎంపీఓ కంటిపూడి వెంకటేశ్వరరావు**



ప్రజాపక్షం వివరణ కోరగా.. మండల పరిధిలోని పలువురు బహిరంగ ప్రదేశాల్లోనే మూత్ర విసర్జన చేస్తున్నారు. ప్రజల సౌకర్యార్థం పబ్లిక్ టాయిలెట్స్ కావాలని ఉన్నతాధికారులకు గతంలో ప్రతిపాదనలు పంపించాం. నాలుగు నెలల క్రితమే మంజూరు కాగా, ప్రజా మరుగుదొడ్లు కట్టేందుకు స్థలం లేక ఆగిందని తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



**ప్రజాపక్షం/పెనుబల్లి:** పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, ఆస్పత్రి నూతన భవనంలోకి వెంటనే మార్చాలని, ఖాళీగా ఉన్న వైద్య పోస్టులు వెంటనే భర్తీ చేయాలని ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు శీలం ఫకీరమ్మ, మండల కార్యదర్శి మిట్టపల్లి నాగమణి గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగుల ఇబ్బందులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల వైద్యాధికారి దృష్టికి సమస్యలను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రారంభం కావడంతో ఆస్పత్రిలో రోగుల తాకిడి పెరుగుతున్న దృష్ట్యా రోగుల అవసరాలకు తగినట్లుగా ఆసుపత్రిలో సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆసుపత్రిలో ఉన్న అన్ని సమస్యలను పరిష్కరించాలని అదే విధంగా అన్ని గ్రామాల్లో వైద్య క్యాంపులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి ఆర్టీసీ బస్టాండ్‌కు దూరంగా ఉండటం వల్ల రిక్వెస్ట్ స్టాప్ పెట్టి బస్సులు ఆపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు జాజిరి జ్యోతి, రత్నకుమారి, తన్నీరు కృష్ణవేణి, ఐద్వా మండల ఉపాధ్యక్షురాలు మర్రి రజిని, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు గాయం తిరుపతిరావు, తడికమళ్ళ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## 9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

**-కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ ను వ్యతిరేకించండి**
**-అఖిలపక్ష కార్మిక సంఘాల పిలుపు**



**ప్రజాపక్షం/మణుగూరు:** జులై 9న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ ను వ్యతిరేకించాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు టియుసిఐ జిల్లా అధ్యక్షులు ఆర్. మధుసూదన్ రెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.శ్రీనివాస్, ఐఎన్టీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు వెలగపల్లి జాన్, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు జి. వేంకటేశ్వర్లు, సి.కె.హెచ్.పి.సి నాయకులు వరదల సమ్మయ్య కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. శుక్రవారం ఓసి టు దుర్గ ఓబీ కంపెనీ కార్మికుల గేట్ మీటింగ్ లోవారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ పరిశ్రమలను పరిరక్షించాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని తదితర డిమాండ్ల సాధన కోసం జాతీయ కార్మిక సంఘాల తో పాటు, రాష్ట్ర కార్మిక సంఘాలు, వివిధ సంస్థలు, ఫెడరేషన్లు జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపు నిచ్చాయని, ఈ సమ్మెలో కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. దేశంలో బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి, కార్మికుల శ్రమను కారు చౌకగా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి కంకణం కట్టుకుందన్నారు. దానిలో భాగంగానే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తుందని, ముందు తరాల కార్మిక వర్గం పోరాడి రక్త తర్పణ చేసి హక్కులు, చట్టాలు సాధిస్తే, నేడు కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చి కార్మిక హక్కులను కాలరాయడానికి పూనుకున్నది అన్నారు. బడా పారిశ్రామికవేత్తలకు వేల కోట్ల రూపాయలు రాయితీలు కల్పిస్తూ, డీజిల్, పెట్రోల్, గ్యాస్, నిత్యావసర సరుకుల తదితర ధరలను పెంచి సామాన్య ప్రజలపై మోయలేని భారాలు మోపుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టవలసిన బాధ్యత కార్మిక వర్గంపై ఉందన్నారు. జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం అందరూ పాల్గొని కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పుకొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ చేతుల్లో మోడీ కీలుబొమ్మ



**ప్రజాపక్షం/ఇల్లందు:** కార్పొరేట్ చేతుల్లో మోడీ కీలుబొమ్మగా తయారయ్యారని అఖిలపక్ష జేఏసీ నాయకులు అన్నారు. జూలై 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం పాత బస్టాండ్ సెంటర్ నుండి జెకె కాలనీ, అంబజార్, కొత్త బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొత్త బస్టాండ్ సెంటర్ వద్ద అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో మతోన్మాద బిజెపి ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లకు కుదించి కార్మిక చట్టాలను కాల రాస్తుందన్నారు. కార్మిక చట్టాలలోని 1926 ట్రేడ్ యూనియన్ యాక్ట్ ను రద్దు చేయడానికి, 1946 స్టాండింగ్ ఆర్డర్ చట్టాన్ని రద్దు చేయాలని వీటి స్థానంలో ఫిక్స్ టర్మ్ ఎంప్లాయిమెంట్ తీసుకురావడం కోసం, నేషనల్ కోల్ మైన్స్ మ్యానిటేషన్ తీసుకురావడం మూలాన కోల్ ఇండియా వ్యాప్తంగా 168 బొగ్గు గనులు ప్రైవేటు పరం చేయడం కోసం బిజెపి ప్రభుత్వం సింగరేణిలో పది బొగ్గు బ్లాకులను ప్రైవేట్ వారికి అప్పజెప్పడం జరిగిందన్నారు. ఏదైతే 1957 యం యం డి ఆర్ ఐ యాక్ట్ ను పరిగణలోనికి తీసుకొని బొగ్గు బ్లాకులను ప్రభుత్వమే చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంటాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, 8 గంటల పని విధానాన్ని కొనసాగించాలని అన్నారు. జులై 9న జరిగే సార్వత్రిక సమ్మెకు అన్ని కార్మిక సంఘాలు మద్దతు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు అబ్దుల్ నబీ, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ ఎండి నజీర్ అహ్మద్, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు సారంగపాణి, టియుసిఐ రాష్ట్ర నాయకులు యాకూబ్ షావలి, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు రామ్ సింగ్, ఏఐటియుసి ఉపాధ్యక్షులు దాసరి రాజారాం, బంధం నాగయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి బాస శ్రీనివాస్, మండల కార్యదర్శి ఉడుత ఐలయ్య, సిపిఎం నాయకులు ఆలేటి కిరణ్, తాళ్లూరి కృష్ణ, ఐఎఫ్టియు నాయకులు ఎండి రాసుద్దీన్, తోడేటి నాగేశ్వరరావు, కొండపల్లి శ్రీనివాస్, టియుసిఐ నాయకులు మల్లెల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## 9న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి




**ప్రజాపక్షం/ములకలపల్లి:** జూలై 9వ తారీఖున జరుగు సార్వత్రిక దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటియూసి జిల్లా కార్యదర్శి మొహమ్మద్ యూసుఫ్ అన్నారు. మండల కేంద్రంలో ఈనెల 9వ తేదీన జరుగుతున్న దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా సమ్మె ప్రచారంలో భాగంగా హమాలీ అడ్డా వద్ద మధ్యాహ్న భోజనం కార్మికుల స్కూల్స్ వద్ద ప్రచానం నిర్వహించి, ఎంఈవో కార్యాలయంలో సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో 102 సంవత్సరముల నుండి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కార్మిక హక్కులను కేంద్ర ప్రభుత్వం రద్దు చేస్తూ 44 కార్మిక చట్టాలతో 29 కార్మికుల చట్టాలను రద్దు చేసి, నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం ప్రజా రైతు కార్మిక వ్యతిరేక విధానాలతో 47కోట్ల మంది కార్మిక వర్గం నష్టపోతుందన్నారు. ఈ సమ్మెలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా నాయకురాలు దాసుల పుష్పావతి, హమాలీ నాయకులు నకరికంటి పుల్లారావు, మిర్యాల వెంకటేశ్వర్లు, సాగర్, పసుపులేటి వెంకటేశ్వర్లు, అలుగుల శారద, శనగవరపు లలిత, నల్లి భాగ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## పెనుబల్లి మండలంలో యూరియా కొరత

**పట్టించుకోని వ్యవసాయ శాఖ అధికారులు**



**ప్రజాపక్షం/పెనుబల్లి:** పెనుబల్లి మండలంలో యూరియా కొరత ఉందని ఖమ్మం జిల్లా భారతీయ జనతా పార్టీ అధికార ప్రతినిధి పడిగల మధుసూదన్ రావు అన్నారు. శుక్రవారం పెనుబల్లి మండలం భారతీయ జనతా పార్టీ మండల శాఖ అధ్యక్షులు బొర్రా నరసింహారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెనుబల్లి మండలంలో యూరియా 60 శాతం సొసైటీకి, 40 శాతం ప్రైవేట్ డీలర్లకు పెనుబల్లి మండలంలో ఒకే డీలర్‌కు 50 టన్నుల యూరియా ఇవ్వటం జరిగిందని, ఆ డీలర్ అతని ఖాతాదారుల వరకే యూరియా ఉందని, మిగిలిన వారికి నా దగ్గర దొరకట్లేదు అనే సమాధానం ఇస్తున్నారన్నారు. దళారులు యూరియా బస్తాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారని, అయినా పట్టించుకోని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు వెంటనే యూరియా బస్తాలను సొసైటీ ద్వారా పంపిణీ చేయాలని, భారతీయ జనతా పార్టీ పెనుబల్లి మండల శాఖ నుంచి కోరటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గాయం నాగరాజు, మండల కార్యదర్శి కోటా సుధాకర్, మండల ఓబీసీ మోర్చా అధ్యక్షులు చెక్కిలాల మంగేశ్వరరావు, పెనుబల్లి మండల సోషల్ మీడియా కన్వీనర్ కాటిని శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పురపాలకంలో పట్టు సాధనకు ప్రదక్షిణలు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో పురపాలకంలో పట్టు సాధనకు పలు రాజకీయ పార్టీలు ప్రదక్షణలు ప్రారంభించారు. నూతనంగా ఏర్పాటైన మున్సిపాలిటీలో పలు రాజకీయాల పార్టీల నాయకులు పట్టు సాధన కొరకు ఆయా వార్డులలో సమస్యలు పరిష్కారం కొరకు రాబోయే ఎన్నికలలో గెలుపొందేందుకు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్, టిడిపి, వామపక్షాలు బిజెపి పలు పార్టీల నాయకులు, సానుభూతిపరులు, కార్యకర్తలు అప్పుడే ప్రారంభించారు. పార్టీలలో చేరేందుకు చేర్పించేందుకు ఆశావహులు ఎదురుచూపులు చూస్తున్నారు. శుభకార్యాలు, వివాహాలు, పరామర్శలు, పలకరింపులు, దశదిన కార్యక్రమాలు, అనారోగ్యం తదితర విషయాలలో సమాచారం చెప్పకపోయినా తెలుసుకొని వెళ్లి పలకరింపులు చేస్తూ ఆకర్షణలు చేస్తున్నారు. కల్లూరు మున్సిపాలిటీలో వార్డులు ప్రక్రియ పూర్తి కావడంతో ఆయా జాబితాలను తీసుకొని పరిశీలన చేస్తూ ప్రక్రియను ప్రారంభించారు. కల్లూరు మున్సిపాలిటీలో వాచ్య నాయక్ తండ, కల్లూరు, తూర్పు పడమర, లోకవరం, పుల్లయ్య బంజర, కిష్టయ్య బంజర, కప్పల బంధం, హనుమ తండా గ్రామపంచాయతీలు కలవగా తాజా ఓటర్ల ప్రకారం 18,524 జనాభా 26,701 కాగా తాజా ఓటర్ల జాబితాను కూడా తీసుకొని పరిశీలన చేసుకుంటున్నారు. నగదును కూడా తయారు చేసుకుని సిద్ధంగా ఉంటున్నట్లు సమాచారం. ఆశావహులు ఆయా గ్రామాలలో ఉన్నవారు ఇప్పటికే అంచనాలు వేస్తున్నారు. గ్రామాలలో పట్టణంలో ప్రధాన పార్టీలు వారు టీ స్టాల్ లో హోటల్లలో ప్రచారం ప్రారంభించారు. రంగంలోకి దిగిన ప్రధాన పార్టీలు కల్లూరు పైఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే తో పాటు మంత్రులు కూడా ప్రధానమైన దృష్టి సారించి ఉన్నట్లు మండలంలో చర్చలు కొనసాగుతున్నవి. అదే విధంగా గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పంచాయతీలలో కూడా గెలుపొందే గుర్రాల కోసం వెతుకులాట ప్రారంభించారు. అదేవిధంగా ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ తో పాటు టిడిపి, బిజెపి, వామపక్షాలు కూడా అదే ఆలోచనతో ఉన్నట్లు చర్చలు కొనసాగుతున్నవి. ఏది ఏమైనప్పటికీ రాజకీయ వేడి మున్సిపాలిటీలో ప్రారంభం కాగా గ్రామీణ ప్రాంతాలలో గెలుపు గుర్రాల కోసం వేట ప్రారంభించారు.

## ఎమ్మార్పీఎస్ జెండా దిమ్మెకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/అశ్వాపురం:** ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవంకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ కమిటీల నిర్మాణంలో భాగంగా అశ్వాపురం మండలంలోని అంబేద్కర్ నగర్‌లో జెండా ఆవిష్కరణ మహోత్సవానికి గురువారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు ఇసంపల్లి కృష్ణ మాదిగ మాట్లాడుతూ వర్గీకరణ ఉద్యమంలో భాగంగా 30 సంవత్సరాలు నిర్విరామంగా కృషి చేసిన మాన్యశ్రీ, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ వారు స్థాపించిన ఎమ్మార్పీఎస్ 31వ సంవత్సరంలోకి అడుగుపెడుతూ వర్గీకరణ ఉద్యమ ఫలాలను అందరికీ పంచడానికి ఆనాడు ఎమ్మార్పీఎస్ ఉద్యమ రూపం దాల్చి ఈ సంవత్సరంతో వర్గీకరణ ద్వారా ఉద్యమ ఫలాలు అందినందుకు సంతోషిస్తూ ఆనందిస్తూ ఎమ్మార్పీఎస్ అంటే ఒక జాతికే కాదు ఎంతో మందికి ఆదర్శమని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆవిర్భావ దినోత్సవం రోజున జెండాలు ఆవిష్కరించడం జాతికి రాష్ట్రానికి దేశానికి గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తోకల వెంకటేశ్వర్లు మాదిగ, కంచర్ల రవి మాదిగ, నాగరాజు మాదిగ, పూస రమేష్ మాదిగ, గద్దల బ్రహ్మయ్య మాదిగ, కొమ్ము సాంబ మాదిగ, ఏసుబాబు మాదిగ, గద్దల ఈశ్వర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## జై భీమా జై బాబు జై సమ్మిదాన్ కార్యక్రమానికి కదలిన కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, జిల్లా అధ్యక్షులు పొదెం వీరయ్య సూచనల మేరకు పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల సమ్మేళనం బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే హాజరు కానున్న సందర్భంగా అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఓరుగంటి భిక్షమయ్య ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించబోయే జై భీమ్ జై బాపూ జై సంవిధాన్ సభకు కాంగ్రెస్ నాయకులు బయలు దేరారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్ బాబు, గాదె పత్రాపరెడ్డి, బట్టా సత్యనారాయణ, ఆవుల రవి, తూము వీరరాఘవులు, బచ్చు వెంకటరమణ, బరాసు సంపత్, మచ్చా నరసింహారావు, ఎస్కే మోసిన్, మల్లెం కరుణ్, గొల్లపల్లి నరేష్ కుమార్, ధరావత్ హర్ష, వేముల విజయ్, కందుల లక్ష్మణ్, భూతం వెంకన్న, చింత రవి, కొండ్రు నాగేశ్వరరావు, రావులపల్లి నరసింహారావు, కమ్మాల వెంకన్న, కమ్మాల వెంకన్న, సొడే వెంకటేశ్వర్లు, గుడ్ల వెంకన్న, కాళిదాసు, లక్ష్మణ్ చారి, సబ్బా పిచ్చయ్య, కంట్లమయ్య గౌడ్, పర్సిక తిరుపతయ్య, కలేటి రామకృష్ణ, యన్నా సంగీతరావు, వల్లేపోగు బాబు, ఊకె వెంకటేశ్వర్లు, తాళ్లూరి సత్యనారాయణ, బొల్లం ఐలయ్య, కోలా శశికాంత్, బేతం నరసింహారావు, చాపా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## 9న జరిగే సమ్మెను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/కారేపల్లి:** జూలై 9న జరుగు దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కారేపల్లి మండలం సీతారాంపురం గ్రామంలో పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం టియుసిఐ కారేపల్లి, కామేపల్లి ఏరియా కమిటీ అధ్యక్ష, కార్యదర్శి నాగేశ్వరరావు, ధరావత్ సక్రులు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చినటువంటి బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ సంస్థలు అన్నిటిని ప్రైవేటుపరం చేసి కార్మికుల హక్కులను కాలరాస్తున్న పరిస్థితి నేడు కొనసాగుతున్నదని, ఎనిమిది గంటల పని దినాన్ని 12గంటలు చేయాలని ఒక దురాలోచన కేంద్ర ప్రభుత్వం చేస్తుందని ఆరోపించారు. 44 రకాల కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చి కార్మికులకు ఎలాంటి స్వేచ్ఛ లేకుండా చేస్తున్న పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా కార్మికులు చైతన్యవంతమై కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో టియుసిఐ నాయకులు బచ్చల దశరథ, రజిత, రామ్‌కుమార్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## అసాంఘిక శక్తుల ఆగడాలను అరికట్టండి



**ప్రజాపక్షం/పినపాక:** మండల పరిధిలోని వలస ఆదివాసి గ్రామమైన చింతలపాడులో ఏడూళ్ల బయ్యారం సిఐ వెంకటేశ్వరరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి గ్రామస్తులతో కలిసి మాట్లాడారు. కమ్యూనిటీ కాంటాక్ట్, ఫ్రెండ్లీ పోలీసింగ్ గురించి వివరించారు. ముఖ్యంగా వలస ఆదివాసి సమూహాలు సంఘటితంగా ఉంటే అసాంఘిక శక్తులను అడ్డుకోవచ్చు అన్నారు. అసాంఘిక శక్తులకు దూరంగా ఉన్నట్లయితే, అభివృద్ధి సాధించవచ్చన్నారు. వలస ఆదివాసీ గ్రామాల ప్రజలకు విద్య వైద్యం, ఉపాధి, రవాణా సౌకర్యాలు కల్పనకు ప్రభుత్వం, పోలీస్ శాఖ కృషి చేస్తుందని, ఆయా గ్రామాల్లో సమస్యలు పోలీస్ శాఖ దృష్టి కి తీసుకువచ్చినట్లైతే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో చూడని మెయిల్స్..!



-వైరా తహశీల్దార్ కార్యాలయం నుంచి పంపిన మెయిల్స్ చూడడం లేదంటున్న అధికారులు
-నెలలు గడుస్తున్నా కలెక్టరేట్ నుంచి సమాధానం రావడం లేదంట..?
-ఆక్రమణ భూములు బోర్డులకే పరిమితం







**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం జిల్లాలో పనిచేస్తున్న కలెక్టర్‌లు మారుతున్నారు. ఆర్‌డివోలు మారుతున్నారు. అయినా కూడా వైరా తహశీల్దార్ కార్యాలయం నుంచి వచ్చిన మెయిల్స్ ఖమ్మం కలెక్టరేట్‌లో చూడటం లేదని అధికారులు తెలుపుతున్నారు. విషయం ఏమిటంటే వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఐదో వార్డులో సర్వే నెంబర్ 98లో ఉన్న ప్రభుత్వ గుట్టను తప్పుడు ధృవీకరణ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఆ తర్వాత ప్రభుత్వ అధికార యంత్రాంగం సర్వే జరిపి ప్రభుత్వ భూమిని గుర్తించి బోర్డులు పెట్టారు. కేవలం బోర్డులకే పరిమితమయ్యారే తప్పన ముందుకు పోలేకపోయారు. ప్రతి మండలంలో ప్రతి జిల్లాలో ప్రభుత్వ భూములు ఆక్రమించుకుంటే సహించేది లేదు. ప్రభుత్వ భూములు తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిపై కేసులు నమోదు చేయాలని ప్రభుత్వం కూడా పదేపదే చెబుతున్న వైరాలో మాత్రం అలాంటి నిబంధన కనిపించడం లేదు ఎందుకు? ఏమిటి? అంటే వైరా తహశీల్దార్ కార్యాలయం నుంచి వచ్చే సమాధానం ఖమ్మం కలెక్టరేట్‌కు మెయిల్ పంపాము. కలెక్టరేట్‌లోని సెక్షన్ సిబ్బంది మెయిల్స్ చూడడం లేదు అని చెబుతున్నారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేసే అధికారులు మెయిల్ చూడటం లేదంట అంటే విధుల పట్ల ఎలాంటి గౌరవం ఉందో అనేది మనకు అర్థం అవుతుంది. అయితే వీరి చెప్పే దాంట్లో వాస్తవం ఉందా లేదా అనేది కూడా ఆలోచించాలి. ఇప్పటికే ఇద్దరు కలెక్టర్‌లు మారారు. ఇటీవల బదిలీపై వెళ్లిన కలెక్టర్ ముజామిల్‌ఖాన్ వైరా తహశీల్దార్‌ను గుట్టకు సంబంధించిన పూర్తి వివరాలు తన వద్దకు పంపించాలని ఆదేశించారు. కాని తర్వాత వైరా తహశీల్దార్ కార్యాలయం నుంచి మేము పదేపదే మెయిల్ పంపిస్తున్నాం. ఖమ్మం కలెక్టరేట్‌లో చూడటం లేదు అంటున్నారు. మరి ఇందులో వాస్తవం ఉందో లేదో కలెక్టర్ సార్ తెలియాలి. 98 సర్వే నెంబర్‌లో 434 గజాల ప్రభుత్వ గ్టుటను శీలం సాయి ప్రియాంక పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వారికి గుట్ట ప్రక్కన 275.5 గజాల స్థలంలో ఇళ్లు ఉంటే తప్పుడు ధృవీకరణ పత్రాలతో 709.55 గజాల ప్రభుత్వ గుట్టను కలుపుకొని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇది నిర్ధారించిన రెవెన్యూ అధికారులు వారిపై నేటి వరకు ఎలాంటి కేసులు పెట్టలేదు. రిజిస్ట్రేషన్ రద్దుకు ఎందుకు సిఫార్స్ చేయకుండా నాన్చుతున్నారు. దీనివెనక ఏమైనా రాజకీయ వత్తులు ఉన్నాయా లేదా అధికారులే మభ్యపరుస్తున్నారా అనేది కూడా కలెక్టర్ సార్ పూర్తిస్థాయిలో విచారణ చేపడితే వాస్తవాలు బయటకు వస్తాయి.

## గ్రామశాఖ అధ్యక్షుల సమ్మేళనంకు భారీ తరలివెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు



**ప్రజాపక్షం/ మధిర :** హైద్రాబాద్‌లోని ఎల్బీ స్టేడియం వేదికగా శుక్రవారం జరుగనున్న కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుల సమ్మేళన కార్యక్రమానికి డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క ఆధ్వర్యంలో మధిర మండలం నుండి కాంగ్రెస్ శేణులు భారీగా తరలి వెళ్లారు. మధిర మండలం పట్టణం నుండి బస్సుల్లో బయలుదేరగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ కాంగ్రెస్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటి సిఎం మల్లు భట్టివిక్రమార్క నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుల సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు, డిప్యూటీ సిఎం మల్ల భట్టివిక్రమార్క పిలుపు మేరకు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివెళ్తున్నట్లు పేర్కొన్నారు. తరలి వెళ్లిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చావా వేణు, నాయకులు నిడమనూరు వంశీకృష్ణ, దుంప వెంకటేశ్వరరరెడ్డి, కర్నాటి రామారావు, అద్దంకి రవికుమార్, రమణనాయక్, చిలువేరు బుచ్చి రామయ్య, ఉంద్దయ్య, కరివేద రాంబాబు, షేక్.జహంగీర్ మండలంలో గ్రామశాఖ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షలు, మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

# ఖమ్మంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో పలు రెస్టారెంట్లు, మసాలా దినుసులు, పచ్చళ్ల తయారీ, స్వీట్ తయారీ కేంద్రాలపై తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ బృందం ఆకస్మిక దాడులు నిర్వహించింది. తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ విభాగం ఉన్నతాధికారులు, ఐపిఎం డైరెక్టర్ డా।। సి. శివలీల ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ టీం హెడ్, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి. జ్యోతిర్మయి ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రోహిత్‌రెడ్డి, పి. స్వాతి, శ్రీశిక, సిహెచ్ లోకేష్, శరత్ లతో కూడిన బృందం శుక్రవారం ఖమ్మం నగరంలోని వైరా రోడ్డులో గల పిఎస్‌కె ఫుడ్స్ అండ్ స్పైసెస్, ఎన్‌టిఆర్ సర్కిల్‌లోని జిపిరెడ్డి ఘీ స్వీట్స్, ఐస్‌క్రీం యూనిట్, పాలమూరు గ్రిల్ రెస్టారెంట్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాలమూరు గ్రిల్ రెస్టారెంట్ నందు వంట గది అపరిశుభ్రంగా ఉండటం, రిఫ్రిజిరేటర్, కోల్డ్ చాంబర్‌లో ఫుడ్ సేఫ్టీ ప్రమాణాల ప్రకారం సరైన ఉష్ణోగ్రతలు మెయింటిన్ చేయకపోవడం, కాలం చెల్లిన ఫ్రూట్ క్రషెస్, కాజు, షాజీరా, న్యూడిల్స్ వంటి ముడి సరుకులపై లేబుల్స్ డిఫెక్ట్ కలిగి ఉండటం, అపరిశుభ్ర వాతావరణంలో కూరగాయలు నిల్వ ఉంచడాన్ని గుర్తించారు. పిఎస్‌కె ఫుడ్స్ అండ్ స్పైసెస్ లో ఫుడ్ హ్యాండ్లర్స్ ఎటువంటి పరిశుభ్రత ప్రమాణాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం తయారీ కేంద్రంలో తగిన లైటింగ్, వెంటిలేషన్ లేకపోవడం, ప్లాస్టిక్ డ్రమ్ముల్లో పచ్చళ్లను నిల్వ ఉంచడం, ముడిసరుకు నిల్వకు సరైన స్టోరేజ్ సదుపాయం లేకపోవడం, ఆహార పదార్థాలు, ముడి సరుకులపై ఈగలు వాలడాన్ని గుర్తించారు. లేబుల్ డిఫెక్ట్ కలిగిన రెడీ టు ఈట్ సేవరిస్, మినపప్పు, రాక్ సాల్ట్, బెల్లం, నూనె, నెయ్యి మొదలగు పదార్థాలను గుర్తించి వాటిని సీజ్ చేశారు. అనుమానిత శాంపిళ్లను పరీక్ష నిమిత్తం హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించారు. వైరా రోడ్డులోని ఐబాకో ఐస్‌క్రీం యూనిట్‌లో సరైన పేరుతో లైసెన్స్ లేకపోవడం, అపరిశుభ్ర వాతావరణంలో ఐస్‌క్రీంలు, చాక్‌లేట్లను నిల్వ ఉంచడం, తయారీ, ఎక్స్‌పైరీ సమాచారం లేకపోవడాన్ని గుర్తించారు. సరైన పేస్ట్ కంట్రోల్ పద్ధతులు పాటించకపోవడం గుర్తించారు. ఎన్‌టిఆర్ సర్కిల్‌లోని జిపిరెడ్డి ఘీ స్వీట్స్‌లో అపరిశుభ్ర వాతావరణంలో కేక్స్ తయారు చేయడం, హానీకర రసాయనాలు, రంగులు కలపడం, ప్లాస్టిక్ బకెట్లలో క్రీములను ఉంచడం, కేకులపై ఈగలు వాలడం, కాలం చెల్లిన చెర్రీస్, ఫ్రూట్ క్రషెస్ లను గుర్తించారు. పలు ఆహార పదార్థాలను సీజ్ చేశారు. కాలం చెల్లిన వాటిని అధికారులు దగ్గరుండి ధ్వంసం చేశారు. ఆయా యాజమాన్యాలపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎఫ్‌ఎస్‌ఎస్ చట్టాన్ని ఉల్లంఘించినందుకు యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశారు. ఆహార పదార్థాల తయారీ, విక్రయించే వారు ఆహార పరిరక్షణ ప్రమాణాలు పాటించి ఫుడ్ సేఫ్టీ నిబంధనలకు అనుగుణంగా విక్రయాలు జరపాలని జ్యోతిర్మయి తెలిపారు. లేని యెడల కేసులు నమెదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు కూడా కల్తీల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు.

## కనిపించకుండా పోయిన మెకానిక్

### -వేదనలో కుటుంబ సభ్యులు

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మంలో విద్యుత్ మోటార్లు మరమ్మతులు చేస్తూ జీవించే రంగు కృష్ణ జులై ఒకటి నుంచి కనిపించకుండాపోయాడు. జులై ఒకటిన ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరిన రంగు కృష్ణ వాహనం కరుణగిరి సమీపంలోని మున్నేటి ఒడ్డున పార్కు చేసి ఉన్నట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. కృష్ణ ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ఎంత ప్రయత్నించిచన దొరకకపోవడంతో ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రంగు కృష్ణ ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు కానీ కుటుంబ సభ్యులకు కానీ సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పిసిసి కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న కట్ల



**ప్రజాపక్షం/వైరా:** హైదరాబాద్ గాంధిభవన్‌లో శుక్రవారం జరిగిన పిసిసి కార్యవర్గ సమావేశంలో కేంద్ర మాజీ మంత్రివర్యులు రేణుకాచౌదరితో పిసిసి ప్రధాన కార్యదర్శులు కట్ల రంగారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేణుకాచౌదరికి వారు అక్కడ స్వాగతం పలికారు. ఈ కాదర్యక్రమంలో పృద్వీచౌదరి, ఖమ్మం మార్కెట్ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, గుర్యరం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత



**ప్రజాపక్షం/ మధిర :** పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత అని మధిర మున్సిపల్ కమీషనర్ సంపత్‌కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మధిర మున్సిపాల్టీలో శుక్రవారం ప్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డుల్లో పిచ్చి మొక్కలను పికివేయటం, కాల్వల పూడిక తీత పనులు, తదితర పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ లాంటి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఎప్పటికప్పుడు మన పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే వాడకంలో లేని కులార్లు, తొట్టెలు, టైర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు, మెప్మా, ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు చేయూతనందించటం అభినందనీయం






**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు పలు సేవా సంస్థలు, దాతలు చేయూతనందించటం అభినందనీయమని ఎంఇఓ వై.ప్రభాకర్ అన్నారు. మండల పరిధిలోని ఖమ్మంపాడు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ఆశాజ్యోతి ఫౌండేషన్ సౌజన్యంతో సభ్యులు కోన లక్ష్మీ మోహన్‌రావు చేతుల మీదుగా 100 స్కూల్ బ్యాగులు, 1000 నోట్ బుక్స్‌ను విద్యార్థులకు అందించటం జరిగింది. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు వేలాది రూపాయలు విలువ చేసే స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్ అందించిన ఆశాజ్యోతి ఫౌండేషన్ వారికి మండల విద్యాశాఖ తరుపున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు కష్టపడి చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాధవ నాగేశ్వరరావు, కుడుముల వెంకట్రామిరెడ్డి, ఎఎపి చైర్మన్ బంక మాణిక్యమ్మ, ముృవ్వ వెంకయ్యబాబు, కళ్యాణపు రాజా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉపాధిలో శిక్షణ



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామపంచాయతీలో పనిచేస్తున్న ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, వన సేవకులు, వాచర్లకు పంచాయతీ సిబ్బందికి కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఈజిఎస్ ఏపీవో హేమమాలిని మాట్లాడుతూ త్వరలో జరగబోయే వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం జరగబోతున్నందున నీడ, పూలు, పండ్లు నిచ్చే మొక్కలను సుమారుగా 70,000 నాటేందుకు ప్రణాళికలను సిద్ధం చేశామని, ఈ సందర్భంగా గ్రామపంచాయతీలో ఉన్న సిబ్బందిని సిద్ధం చేయడం జరిగిందని, అంతర్గత రోడ్లు ఇరువైపులా ప్రభుత్వ కార్యాలయాలలో అంగన్‌వాడీ కేంద్రాలలో నాటేందుకు సిద్ధంగా ఉంచామని వివరించారు. గుంతలు తీయడం, నాటడం, పెంచడం నీరు పోయడం కలుపు తీయడం లాంటి కార్యక్రమాలపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని ఏపీవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రంజిత్ కుమార్, ఈజీఎస్ జేఈ పుల్లారావు లతోపాటు ఉపాధి సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# 9న సార్వత్రిక సమ్మెకు సహకరించండి



**పెడరేషన్లు, అసోసియేషన్ల ఆధ్వర్యంలో కొత్తగూడెంలో ర్యాలీ**

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** ప్రభుత్వ రంగ సంస్థలు, జాతీయ సహజ వనరుల రక్షణ, కార్మిక చట్టాల పరిరక్షణకోసం జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెకు అన్నివర్గాల ప్రజలు సహకరించాలని కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. సమ్మెను జయప్రదం చేయాలనీ కోరుతూ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, ఫడరేషన్ల, అసోసియేషన్ల పిలుపుమేరకు శుక్రవారం కొత్తగూడెం పట్టణంలోని ప్రధాన సెంటర్ల మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని పాల కేంద్రం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఎంజి రోడ్డు, పెద్దబజార్, బస్టాండ్, పోస్టాఫీసు మీదుగా బైపాస్ రోడ్డువరకు చేరింది. ర్యాలీ ప్రారంభ, ముగింపు సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య, సిఐటియు జిల్లా నాయకులూ ఏజె రమేష్, ఐఎన్టియుసి జిల్లా నాయకులు జలీల్, ఐఎఫ్టియు, టియుఎల్ఈ జిల్లా నాయకులు సంజీవ్ ఏడుకొండలు మాట్లాడుతూ, కేంద్రం లోని మోడీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తోందని, జాతీయ సంపదను, ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు అమ్మేస్తుందని ఆరోపించారు. డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్, నిత్యావసరాల ధరలను పెంచి పేద, మధ్యతరగతివర్గాలపై పెనుభారం మోపుతోందని విమర్శించారు. కార్మిక చట్టాలను సవరించి శ్రామికుల శ్రమను యాజమాన్యాలు దోచుకునే విధంగా కేంద్రం కుట్రలు చేస్తుందన్నారు. ఈ పరిస్థితిలో జరుగుతున్న సమ్మెను విజయవంతం చేయడం ద్వారా కేంద్రానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వంగ వెంకట్, ఎస్వి రమణమూర్తి, గెద్దాడు నగేష్, బండారు మల్లయ్య, భూక్యా శ్రీనివాస్, సిఐటియు నాయకులు భూక్యా రమేష్, బాలకృష్ణ, బాలరాజు, ఐఎన్టియుసి నాయకులు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీల అభివృద్ధికి ఎల్లప్పుడూ పోలీసుల కృషి

**- కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాంలో ఎస్పి**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఆదివాసీల అభివృద్ధి, వారి సంక్షేమం కోసం పోలీసులు అనునిత్యం కృషి చేస్తారని ఎస్పి రోహిత్ రాజ్ అన్నారు. శుక్రవారం లక్ష్మీ దేవిపల్లి మండలం, గంగమ్మ కాలనీ గొత్తికోయ గ్రామంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాంకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ ఆదివాసీ ప్రజలకు కనీస సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా పోలీసుశాఖ పనిచేస్తుందన్నారు. యువత, పిల్లలు విద్య ద్వారానే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని తెలిపారు. గ్రామంలోకి ఎవరైన కొత్తవ్యక్తులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని,స్థానికంగా కూడా ప్రశ్నించాలన్నారు. వర్షాకాలంలో ఇండ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అధికంగా మురుగు నీరు చేరడం వల్ల దోమలు వ్యాప్తి చెంది డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాలు సోకుతాయని చెప్పారు. అనంతరం అక్కడ నివేసించే 27 కుటుంబాల వారికి దుప్పట్లు, దోమతెరలు పంపిణీ చేశారు. విద్యుత్, మొబైల్ నెట్‌వర్క్ సమస్యలను పరిష్కరించేందుకు వెంటనే ఆయాశాఖల ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. ఆదివాసీ ప్రజల ప్రస్తుత స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి జి నరేందర్, డిఎస్పి రెహమాన్, ఎస్‌బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, చుంచుపల్లి సిఐ వెంకటేశ్వర్లు, లక్ష్మీ దేవిపల్లి ఎస్సై రమణారెడ్డి, ఎస్సై కార్తీక్, లక్ష్మీ దేవిపల్లి పోలీస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# మహాసభ తీర్మానాలపై మిలిటెంట్ ఉద్యమాలు చేపడతాం

**ఏఐఎస్ఎఫ్ జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులు షాహెద్, అజిత్**



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** పాల్వంచలో ఇటీవల జరిగిన భద్రాద్రి జిల్లా అఖిలభారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ నాలుగో మహాసభలో ఎన్నికైన నూతన ఆఫీస్ బేరర్లు, కౌన్సిల్ సభ్యులను శుక్రవారం శేషగిరి భవన్లో జరిగిన విలేకర్ల సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్కె ఫహీమ్ ప్రకటించారు. అధ్యక్షుడిగా ఎస్కే షాహిద్, కార్యదర్శిగా వర్క అజిత్, సంయుక్త కార్యదర్శిగా ఎం.వినయ్, ఉపాధ్యక్షులుగా నాగేంద్ర బాబు, టి.వినయ్, పవన్ కళ్యాణ్, సంజయ్, సహాయ కార్యదర్శులుగా గుండాల సృజన్, పవన్ సాయి, గుగులోత్ వంశి, బత్తుల సాయి, ఎన్.సాయికుమార్లతో పాటు మరో 36 మంది కౌన్సిల్, 18 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు ఫహీమ్ ప్రకటించారు. ఈ సందర్బంగా సంఘం జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులు షాహెద్, అజిత్ మాట్లాడుతూ.బకాయి ఉపకారవేతనాలు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తూ విద్యకు దూరం చేస్తోందని, ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులను గెంటివేసే పరిస్థితులకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని విమర్శించారు. ప్రధానమైన ఉపకారవేతనాల సమస్యతో పాటు ఇతర తొమ్మిది అంశాలపై మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించిందని, ఈ తీర్మానాల అమలు, సాధనకోసం జిల్లావ్యాపితంగా మిలిటెంట్ ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు. ప్రధానంగా భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ అమలు, సంక్షేమ హాస్టళ్లు, వసతిగృహాల్లో మౌలిక వసతులు, ప్రభుత్వ విద్య సంస్థల బలోపేతం, ఖాళీల భర్తీ, సొంత నూతన భవనాలు, ప్రైవేటు విశ్వవిద్యాలను అనుమతుల రద్దు, కేంద్రం తీసుకొచ్చిన నూతన విద్యావిధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని తెలిపారు.ఏఐఎస్ఎఫ్ ఉద్యమాలకు సహకరించాలని కోరారు.

# సింగరేణిలో ఘనంగా కొణిజేటి రోశయ్య జయంతి



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** సింగరేణి ప్రధాన కార్యాలయం లోని హెచ్ఆర్‌డి కాన్ఫరెన్స్ హాల్ నందు శుక్రవారం నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి తమిళనాడు కర్నాటక మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలను నిర్వహించడం జరిగింది. జిఎం పర్సనల్ వెల్ఫేర్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా జిఎం సేఫ్టీ సిహెచ్.శ్రీనివాస్ హాజరయ్యారు. ముందుగా రోశయ్య చిత్ర పటానికి యూనియన్ నాయకులు, శాఖాధిపతులు, అధికారులు ఉద్యోగులు ఆయనకు ఘనంగా పూలమాలతో, పూలతో ఘనం గా నివాళులు అర్పించారు. అనంతరం ఈ సంధర్భముగా శ్రీనివాస్ మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి తమిళనాడు కర్నాటక మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య జయంతి ఉత్సవాలను ఇక్కడ ఇంత ఘనముగా జరుపుకోవటం చాలా సంతోషముగా ఉందని, కార్పొరేట్ లో మాత్రమే కాకుండా సింగరేణి వ్యాప్తముగా కూడా ఈ జన్మదిన వేడుకలను జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటియూసి బ్రాంచ్ సెక్రటరీ ఎస్వి.రమణ మూర్తి, ప్రాతినిధ్య సంఘం కార్పొరేట్ బ్రాంచ్ సెక్రటరీ సిహెచ్.మహేష్ కుమార్, కార్పొరేట్ సిఎంఓఏఐ అధ్యక్షుడు ఎస్.వెంకటా చారి, జిఎం పర్సనల్ వెల్ఫేర్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్, జిఎం స్టోర్స్ పి.ఎలిషా, జిఎంహెచ్ఆర్‌డి టి.వెంకట రామి రెడ్డి, డిజిఎం పర్సనల్ లు కేసా నారాయణ రావు, బి.శివ కేశవ రావు, ముకుంద సత్యనారాయణ, కార్పొరేట్ లోని వివిధ విభాగాల జనరల్ మేనేజర్లు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# విత్తనాల సేకరణలో విద్యార్థులు భేష్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పర్యావరణం పచ్చదనంపై విద్యార్థుల్లో అవగాహ కల్పించేందుకు విత్తనాల సేకరణలో విద్యార్థులు చేసిన కృషి ప్రశంసలు అందుకుంటోంది. పర్యావరణం పట్ల అవగాహన పెంచేందుకు గానూ విత్తనాల సేకరణ కార్యక్రమాన్ని వినూత్నంగా చేపట్టిన విషయం విధితమే. కాగా ఇందులో భాగంగా కొత్తగూడెం మండలంలోని రామవరం హైస్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కూలీలైన్ హైస్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల కూలీలైన్ ప్రథమ స్థానంలో నిలిచాయి. అన్ని మండల స్థాయిలో రామవరం ప్రభుత్వ పాఠశాల ప్రథమంగా, కూలీలైన్ పాఠశాల ద్వితీయ స్థానంలో ఉన్నాయి. కాంప్లెక్స్ స్థాయి విజేతలకు రూ.1000, మండలస్థాయి విజేతలకు రూ.5000ప్రోత్సాహకాన్ని కలెక్టర్ ప్రకటించారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారికి రూ.50వేలు ప్రోత్సాహకంగా కలెక్టర్ అందివ్వనున్నారు. ఈ సందర్భంగా 80 రకాల విత్తనాలు సుమారు 70 కేజీల వరకు సేకరించారు. మండలస్థాయి ఎంపికల్లో నిర్ణేతలుగా ఆనందఖని ఉన్నత పాఠశాల సీనియర్ సిబ్బంది, కూలీలైన్ స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం లాలు, కొత్తగూడెం ఎంఇఓ డా. ప్రభు దయాల్, సిఆర్‌పిలు, ఎంఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

# టిఎల్‌యుడి పద్దతిలో నాణ్యమైన బయోచార్

**- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** టాప్ లిస్ట్ అప్‌డ్రాఫ్ట్ పద్దతిలో నాణ్యమైన బయాయోర్ తయారు చేయవచ్చని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం సుజాతనగర్ మండల పరిధిలోని మేకలగడ్డ గ్రామంలో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన బయోచార్ యూనిట్‌ను ఆయన పరిశీలించారు. ఈ ప్రయత్నంలో 30 కేజీల పనికిరాని కట్టెముక్కలను చిన్నచిన్న ముక్కలుగా చేసి మండిచండం ద్వారా 10కిలోల నాణ్యమైన బయోచార్ తయారైనట్లు చెపాప్రు. దీనిలో ఆవుపేడ, మొదలైనవి కలిపి కొద్దిరోజుల పాటు నిల్వ ఉంచి ఆరబెట్టి, పొడిగా చేసి పంటలకు ఎరువుగా ఉపయోగించాలని సూచించారు. డివిజన్లోని రైతు వేదికల ద్వాలరా బయోచార్ తయారు విధానం గురించి రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

# సర్దుబాటు సవరించే వరకు ఉద్యమం ఆగదు

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :**



ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వలను సవరించే వరకు ఉద్యమం ఆగదని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు పేర్కోన్నారు. మండలంలోని వివిధ గ్రామాల పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నర్సరీ, కేజీ తరగతులకు ప్రాథమిక పాఠశాలలో ప్రవేశపెట్టి తరగతి కి ఒక ఉపాధ్యాయుడుని కేటాయించి పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. పాఠశాలలో ప్రవేశాల కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. నూతన ఆవసాలు పెరిగినందున్న అక్కడ నూతన పాఠశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. పదోన్నతలు కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ యూపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. నూతన జాతీయ విధానాన్ని రదు చేయాలని కోరారు. గురుకుల పాఠశాలల సమయాన్ని విద్యా హక్కు చట్టం ప్రకారం 9 గంటల నుంచి 4:30 గంటల వరకు మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కట్టా పద్మ, అరవింద్, జ్యోతి, వెంటరమణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు జ్యోతి, తొర్తి గురవయ్య, నవాబ్సాహెబ్, కోటేశ్వరరావు, శ్రీను, స్వామి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# హెదరాబాద్ తరలి వెళ్లిన కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** హైదరాబాద్ లో జరిగిన కాంగ్రెస్ గ్రామ శాఖల అధ్యక్షుల సభ కు మండలం నుంచి పెద్ద సంఖ్యతో తరలివెళ్లారు. శుక్రవారం ర్యాలీ ని నాయకులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. కాంగ్రెస్ ను స్థానిక సంస్థల ఎన్నికలలో విజయం సాధించేలా ప్రతీ కార్యకర్త సైనికుల్లా పని చేయాలని సూచించారు. జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు, మంత్రి శ్రీనివాసరెడ్డి సూచనల మేరకు ప్రతీ ఒక్కరూ పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు, బోయిన వేణు, తీగ రమణయ్య, యడవల్లి హుస్సేన్ గౌడ్, సైదా, నంబూరి నరేష్, తేజావత శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# బహిరంగ సభకు కదలిన కాంగ్రెస్ శ్రేణులు

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** రాష్ట్ర రాజధాని హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో శుక్రవారం జరిగే ఏఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే సభకు సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా.మట్టా దయానంద్‌ల ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు భారీగా బయలుదేరారు. ర్యాలీని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డా.మట్టా దయానంద్ విజయ్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. కాంగ్రెస్ శ్రేణులతో కలిసి రాష్ట్ర నాయకుడు డా.మట్టా దయానంద్ సత్తుపల్లి నుండి తల్లాడ వరకు బస్సులో ప్రయాణం చేసి నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. సత్తుపల్లి నుంచి తరలి వెళ్లిన వారిలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదే చెన్నకేశవరావు, సీనియర్ నాయకులు చల్లగుళ్ళ నరసింహారావు, కమల్ పాషా, మానుకోట ప్రసాద్, పింగుల సామ్యూల్, ఐ.శ్రీను, రామారావు ఆంగోతు, విరివాడ నాగభూషణం, మట్టా చెన్నారావు తదితరులున్నారు.

# పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే..

**సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం**

ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం : సాయుధ తెలంగాణ పోరాటంలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులంతా ఏకమై పేద ప్రజల పక్షాన పోరాడింది కమ్యూనిస్టులేనని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. మండల పరిధిలోని కొక్కిరేణి గ్రామానికి చెందిన స్వర్గీయ కామ్రేడ్ చావా వెంకటేశ్వరరావు 11వ వర్ధంతికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని చావా వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు పార్టీ జెండాను ఆవిష్కరించి అనంతరం సిపిఐ మండల కార్యదర్శి బత్తుల రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. సాయుధ తెలంగాణ పోరాటంలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పేద ప్రజల పక్షనా నిలబడి పోరాడింది చావా వెంకటేశ్వరరావు అని అన్నారు. దొరలపాలనకు వ్యతిరేకంగా పోరాడి భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాడి దొరల ఆధీనంలో ఉన్న వందల ఎకరాల భూములను పేద ప్రజలకు పంచిన ఘనత చావా వెంకటేశ్వరరావుకి ఉందని తెలిపారు. కొక్కిరేణి గ్రామంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో సిపిఐ పార్టీ ఎదుగుదలకు ఆయన ఎంతో కృషి చేశారని తెలిపారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు.



ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండి సురేష్, రాష్ట్ర రైతు సంఘం నాయకులు మహమ్మద్ మౌలానా, బిఆర్ఎస్ జిల్లా నాయకులు, సొసైటీ చైర్మన్ చావా వేణుగోపాలకృష్ణ, సిపిఐ మండల కార్యదర్శి బత్తుల రాధాకృష్ణ, సహాయ కార్యదర్శి చీమ రామకృష్ణ, మండల నాయకులు చావా వెంకట్రావు, మల్లేపల్లి జనార్దన్, మధు, బిఆర్ఎస్ నాయకులు గద్దం వీరభద్రం, గంట కృష్ణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నానో యూరియా వాడకాన్ని ప్రోత్సహించాలి

**-శిక్షణ కార్యక్రమంలో**
**జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య**



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : నానో యూరియా, నానో డిఏపి రైతులు వినియోగించేలా ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. శుక్రవారం రఘునాథపాలెం రైతు వేదికలో వ్యవసాయ శాఖ క్షేత్ర స్థాయి సిబ్బందికి, వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులకు జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య అధ్యక్షతన కోరమాండల్ ఫెర్టిలైజర్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నానో యూరియా, నానో డిఏపి ఎరువులపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ జిల్లాలో రైతులు వివిధ పంటలపై నానో యూరియా, నానో డిఏపి వాడకాన్ని ప్రోత్సహించాలన్నారు. రైతులు కూడా వాటి గురించి తెలుసుకుని నానో యూరియా, నానో డిఏపి లను వాడాలన్నారు. వీటి వాడకం ద్వారా భూసారం పెరుగుతుందని, రసాయనిక ఎరువులపై పెట్టే ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. నానో యూరియా, నానో డిఏపికి సంబంధించి పూర్తి స్థాయి సమాచారాన్ని శిక్షణలో అందించారు. క్షేత్రస్థాయిలో రైతులకు వాటిపై అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు, సాంకేతిక వ్యవసాయ అధికారులు, ఏఈఓలు, కోరమాండల్ కంపెనీకి చెందిన డా॥ టి. సుధాకర్‌రెడ్డి, జోనల్ ఆఫీసర్ సుమన్‌రెడ్డి, బిజినెస్ హెడ్ స్వరూప్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# త్రివేణిలో వన మహోత్సవం



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. గత వారం రోజులుగా పాఠశాల విద్యార్థులు తమ పరిసర ప్రాంతాల్లో, స్కూల్ ఆవరణలో మొక్కలు నాటి ప్రకృతి పట్ల తమకున్న బాధ్యతను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా త్రివేణి విద్యా సంస్థల అధిపతి గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ వన మహోత్సవం అంటే భూమి తల్లిని కాపాడటం అని అందుకే దీనిని వన మహోత్సవం అంటారన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంపకమే మార్గమన్నారు. ఇల్లు, కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు మొదలగు వాటిల్లో మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. త్రివేణి సైన్స్ ఆఫీసర్ సుబ్బారావు మాట్లాడుతూ ఈ వన మహోత్సవం భూమికి, పర్యావరణానికి సంబంధించిందన్నారు. చెట్లు మన పర్యావరణానికి మూలమని అవి అత్యుత్తమ ఫలితాన్ని ఇస్తాయన్నారు. ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో పర్యావరణం ఒకటన్నారు. పర్యావరణ కాలుష్యం వల్ల అకాల వర్షాలు, అధిక ఉష్ణోగ్రతలు, ప్రకృతి విపత్తులు సంభవిస్తున్నాయన్నారు. అటువంటి పర్యావరణాన్ని మొక్కల పెంపకంతో పరిరక్షించుకోవచ్చునన్నారు.ఈ కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యా సంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, సిఆర్‌వో మురళి కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ముస్తఫా, చార్లెస్, సందీప్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలి

ప్రజాపక్షం/జూలూరుపాడు: వ్యవసాయ సీజన్ ప్రారంభం అవడంతో రైతులకు ఎరువుల అవసరం ఉంటుందని, కాబట్టి రైతులకు ఎరువుల కొరత లేకుండా అధికారులు తగు విధంగా చర్యలు చేపట్టాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భానోత్ మధు అన్నారు. రైతులు ఇప్పటికే పత్తి పంటను సాగు చేసుకుంటున్నారని, పత్తికి ఎరువులు వేసే దాని కోసం సిద్ధంగా ఉన్నప్పటికీని పురుగు మందుల షాపులో ఎరువులు అంటే 20:20:0,13తో పాటు యూరియా పత్తి మొక్కలకు వేయవలసినా అవసరం ఉందని, కానీ షాపులలో యూరియా కొరత అధికంగా ఉందని, దీనిని ఆసరాగా చేసుకొని వేరే ఏదైనా రసాయ ఎరువులు



కట్టను కొంటేనే యూరియా ఇస్తామనే నిబంధనలు పెట్టడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా సొసైటీ, గ్రోమోర్ లాంటి సెంటర్లలో రైతులను ఎలాంటి నిబంధన లేకుండా రైతులు అడిగినటువంటి ఎరువులకు ఇచ్చే విధంగా అధికారులు వారికి సూచన చేయాలని కోరారు. ఇలాంటి పరిస్థితులే ఉంటే రైతులు ప్రభుత్వంపై తిరగబడే రోజులు ఉన్నాయని, అలాంటి పరిస్థితులు రాకుండా ప్రభుత్వం వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందించి రైతులకు ఎలాంటి కొరత లేకుండా నిబంధనలు లేకుండా చూడాల్సిన అవసరం ఉందని తెలిపారు.

# హైదరాబాద్ తరలిన కాంగ్రెస్ శ్రేణులు

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : హైదరాబాద్‌లో ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖార్గే సమర భేరీ సభకు ఖమ్మం నియోజక వర్గానికి చెందిన కాంగ్రెస్ నేతలు తరలి వెళ్లారు. శుక్రవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ఎల్‌బి స్టేడియంలో ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖార్గే ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమరభేరీ సభకు ఖమ్మం నగరంతో పాటు రఘునాథపాలెం మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయం వద్ద హైదరాబాద్ వెళ్లే బస్సులకు మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు జెండా ఊపి ప్రారంభించారు. హైదరాబాద్ వెళ్లే నాయకులకు, కార్యకర్తలకు మార్గ మధ్యలో భోజన వసతిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగంధర్ సారధ్యంలో ఏర్పాటు చేశారు. తుమ్మల యుగంధర్ దగ్గర ఉండి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



# రేపు పుస్తకావిష్కరణ సభ

ప్రజాపక్షం/ఖమ్మం : ఏనుగు కిషోర్‌బాబు రచించిన మూడు పుస్తకాల ఆవిష్కరణ సభ ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు ఖమ్మం జెడ్పి మీటింగ్ హాల్‌లో జరగనుంది. కిషోర్ బాబు రచించిన అద్దుగోడలు, నడుస్తున్న చరిత్ర, కిషోర్ శతకం పుస్తకాల ఆవిష్కరణ సభకు ప్రముఖ కవి, జర్నలిస్టు, కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు బెల్లం కొండ ప్రసేన్ అధ్యక్షత వహించనున్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా మాజీ శాసన సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, ముఖ్య అతిథులుగా కవి, విద్యావేత్త మువ్వా శ్రీనివాసరావు, పోపూరి రవిమారుత్, ఆత్మీయ అతిథులుగా ప్రముఖ కవి లెనిన్ శ్రీనివాస్ హాజరుకానున్నారు. ఈ పుస్తకాలను కవి, అనువాదకులు శ్రీవచన జనార్ధనా సూరి పరిచయం చేయనున్నారు. సాహిత్య ప్రియులు హాజరై ఈ పుస్తకావిష్కరణ సభను జయప్రదం చేయాలని పుస్తకావిష్కరణ కమిటీ కోరింది.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



ప్రజాపక్షం/ బోనకల్ : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన మండల పరిధిలోని రావినూతల గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని కలకోట గ్రామానికి చెందిన విఆర్‌ఎ వెంగళ అప్పయ్య(45) విధుల నిర్వహణలో భాగంగా బైకుపై కార్యాలయానికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన గేదెను ఢీకొనగా జరిగిన రోడ్డు ప్రమాదంలో అప్పయ్యకు తీవ్ర గాయాలయాలయ్యాయి. స్థానికులు 108కి సమాచారం అందించగా చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తుంగా మార్గం మధ్యలో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అప్పయ్య మృతితో వారి కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# హైదరాబాద్ తరలిన కాంగ్రెస్ శ్రేణులు



ప్రజాపక్షం/ఏర్రుపాలెం : హైద్రాబాద్‌లో ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జునఖర్గే అధ్యక్షతన శుక్రవారం జరిగే కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుల సమ్మేళనం కార్యక్రమానికి ఎర్రుపాలెం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బస్సుయాత్రను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హైద్రాబాద్‌కు తరలివెళ్లారు.

# పేరువంచ హైస్కూల్‌లో విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు వితరణ



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండల పరిధిలోని పేరువంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి సంబంధించి ప్లేట్లు, గ్లాసులను ఆ పాఠశాల పూర్వ విద్యార్థిని మెదక్ ఎక్సైజ్ సీఐ మేచర్ల రాధా శుక్రవారం పంపిణీ చేశారు. పూర్వ విద్యార్థిని మేచర్ల రాధా అక్కయ్య మేచర్ల సుజాత జ్ఞాపకార్థం గ్లాసులు, ప్లేట్లు అందించినట్లు ఎక్సైజ్ సిఐ మేచర్ల రాధా తెలిపారు. ప్లేట్లు, గ్లాసులు అందించి హై స్కూల్ విద్యార్థులకు విందు భోజనం ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలని మేచర్ల రాధా ఆకాంక్షించారు. మాదక ద్రవ్యాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని విద్యార్థులను కోరారు. ఈ సందర్భంగా హై స్కూల్ ఉపాధ్యాయులు సిఐ మేచర్ల రాధను, తల్లిదండ్రులుమల్లేశ్వరరావు, మరియమ్మలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ హెచ్ఎం సుదర్శన్ రావు, ఉపాధ్యాయులు ఎండి మౌలాలి, జ్యోతి, సర్వేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు కీసర వీళ్ళ మోహన్ రెడ్డి, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.